ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 95, పేజీలు - 08

ఆదివారం,అక్టోబర్ 04, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## పిల్లల సైబర్ భద్రతకు సమగ్ర ఫ్రేమ్‌వర్క్

### - ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు - మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి

- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల బారిన పడకుండా పిల్లలకు అవసరమైన భద్రత, సంరక్షణ అందించేందుకు న్యాయ సేవల ప్రాధికార సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిజిటల్ వేదికలపై చిన్నారుల రక్షణకు సంబంధించి న్యాయ సేవల సంస్థలు రూపొందిస్తున్న కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ (నల్సా) ఆధ్వర్యంలో 'డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం, ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం' అనే అంశంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్‌తో పాటు పలువురు సుప్రీంకోర్టు,




హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయ సేవల సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు.

2లో..

## 'సత్యాగ్రహ'తో రాహుల్ నయా ట్రెండ్!

### - దేశవ్యాప్తంగా నిరసనలకు ఒకే వేదిక




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొత్త డిజిటల్ వేదికను మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా పలు సమస్యలపై ప్రజలు, విద్యార్థులు, రైతులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, ఇతర వర్గాలు చేపడుతున్న నిరసనలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో సత్యాగ్రహ పేరుతో ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అక్టోబర్ 2వ తేదీన మహాత్మా గాంధీ జయంతి తర్వాతి రోజున ఈ సత్యాగ్రహ డిజిటల్ వేదికను రాహుల్ గాంధీ ప్రారంభించడం గమనార్హం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. అయితే చాలా సందర్భాల్లో ఆయా పోరాటాలు విడివిడిగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఉద్యమాలను ఒకే చోటికి తీసుకురావడమే సత్యాగ్రహ వేదిక ఉద్దేశమని తెలిపారు.

2లో..

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు చేయించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి ఎదురైన కష్టాలను స్పష్టం చేస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరడం, రాజకీయ మార్పుల సంకేతంగా భావించవచ్చు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు, పార్టీకి చేరిన నేతలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని స్పష్టం చేశారు. సాధారణంగా

2లో..



## అక్టోబర్ 10 నుంచి బతుకమ్మ వేడుకలు

- సద్దుల బతుకమ్మకు భారీ ఏర్పాట్లు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. తెలంగాణ సంస్కృతికి చిరునామాగా నిలిచే బతుకమ్మ పూల పండగను ఈ నెల 10 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

2లో..

## టెక్నాలజీ రంగంలో ఏపీకి కొత్త గుర్తింపు

### - ఆవిష్కరణలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026 - డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం - వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్

**అమరావతి (ప్రశ్న న్యూస్)**(ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ




కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు.

2లో..

## శ్రీసిటీ పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదం

- 5కు చేరిన మృతుల సంఖ్య, 10 మందికి గాయాలు
- వారి కుటుంబాలకు రూ. 50 లక్షల పరిహారం



**తిరుపతి (ప్రశ్న న్యూస్)** తిరుపతి జిల్లా శ్రీసిటీ పరిధిలోని టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమలో బాయిలర్ పేలిన ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఈ ప్రమాదంలో ఘటన స్థలంలో ఇద్దరు మరణించగా, సమీపంలోని ఆస్పత్రులలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించారు. అయితే మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించిన

2లో..

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ శాంతి చొరవ

- మోదీ ప్రతిపాదనపై ఉక్రెయిన్ ప్రశంసలు!

2లో..



## నిండు గర్భిణీకి డోలీ కష్టాలు

### - అల్లూరి జిల్లాలో అడుగడుగునా ప్రాణభయం!

- రోడ్డు లేక 7 కిలోమీటర్లు డోలి ప్రయాణం
- 108 అంబులెన్స్ కూడా చేరుకోలేని పరిస్థితులు
- ఎన్ని ప్రభుత్వాలు మారినా.. మారని పరిస్థితి

**అమరావతి (ప్రశ్న న్యూస్)** స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 8 దశాబ్దాలు కావొస్తున్నా పలు రాష్ట్రాల్లో ఇంకా అన్ని ప్రాంతాలకు రోడ్డు, మంచి నీటి, విద్యుత్ సౌకర్యాలు సరిగ్గా లేవు. అలాంటి ప్రాంతాల్లో ఏపీలోని ఏజెన్సీ ఏరియాలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు లేక గిరిజనులు పడుతున్న తీవ్ర అవస్థలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. నిండు గర్భిణీని అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి తరలించేందుకు కనీస రోడ్డు సదుపాయం కూడా అందుబాటులో లేకపోవడంతో, కుటుంబ సభ్యులే ఆమెను డోలీలో కిలోమీటర్ల వేర మోసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని తడకపల్లి ప్రాంతానికి చెందిన ఓ గర్భిణీని ఆమె కుటుంబ సభ్యులు సుమారు 7 కిలోమీటర్ల మేర రాళ్లు, రప్పలతో కూడిన కష్టతరమైన బాటలో డోలీలోనే మోసుకెళ్లాల్సి వచ్చింది. నెలలు నిండిన గర్భంతో ఉన్న మహిళను అంతటి దూరం మోయడం కుటుంబ సభ్యులకు అత్యంత శ్రమతో కూడుకున్నదిగా మారింది. తీసుకెళ్తుంటే కొండలు, గుట్టల్లో జారి పడిపోతే కనుక అటు గర్భిణీతో పాటు తీసుకెళ్లే వారి ప్రాణాలు సైతం ప్రమాదంలో పడతాయని చెబుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా, అత్యవసర సమయాల్లో ఇప్పటికీ డోలీనే ఆధారంగా చేసుకోవడం గిరిజనులను నేటికీ తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి ఉందని వాపోతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, పసిపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి చేరకముందే దారిలోనే ప్రాణాలు వదిలే పరిస్థితులు ఉన్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గర్భిణికి అకస్మాత్తుగా నొప్పులు రావడంతో, ఆసుపత్రికి తరలించేందుకు రోడ్డు మార్గం లేక కుటుంబ సభ్యులే డోలీ కట్టాల్సి వచ్చింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదని, మౌలిక వసతులు మాత్రం కల్పించడం లేదని స్థానిక గిరిజనులు వాపోతున్నారు. రహదారులు, రవాణా వసతులు లేకపోవడం వల్ల తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు ప్రతిసారీ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలకు ఎప్పటికి శాశ్వత పరిష్కారం చూపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## ఆసుపత్రుల నిర్మాణాల్లో వేగం పెంచాలి

### - అధికారులకు సీఎం కీలక ఆదేశాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న కీలక ప్రభుత్వ ఆసుపత్రుల పనులను వేగవంతం చేయడంతో పాటు ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చే సమయానికి అక్కడ సిబ్బంది కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎంవో అధికారులతో నిర్వహించిన సమీక్షలో విద్య, వైద్యం, సీజనల్ వ్యాధులు, ఫ్యూచర్ సిటీ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఉస్మానియా ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఎల్బీనగర్ టిమ్స్ , అల్వాల్ టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

2లో..



## ఆరంభంలో తడబడినా ఆఖర్లో పతకాల సునామీ

2లో..

- 21 స్వర్ణాలతో టోటల్ 85 మెడల్స్ కొల్లగొట్టిన భారత్



## పిల్లల సైబర్ భద్రతకు సమగ్ర ఫ్రేమ్‌వర్క్

భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామని వివరించారు. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. పోలీసు శాఖ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో షీ-భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయని, సైబ్హర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులను సైబర్ అంబాసిడర్లుగా తీర్చిదిద్ది, తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించేందుకు టీజీఎస్ - ఎల్ఎస్ఏ పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని సీఎం తెలిపారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సైబర్ నేరాల నివారణలో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. పిల్లలను తప్పుపట్టకుండా స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి ఆన్‌లైన్ కార్యకలాపాలపై అవగాహనతో మార్గనిర్దేశం చేయాలని కోరారు.సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే స్పందించేందుకు 1930 నంబర్‌ను, పిల్లల సహాయం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను గుర్తుంచుకోవాలని సీఎం సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష విధించడం మాత్రమే కాదని, బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం, గౌరవాన్ని పునరుద్ధరించడం కూడా న్యాయంలో భాగమేనన్నారు. ముఖ్యంగా పిల్లలు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయమని పేర్కొన్నారు. సదస్సులో చర్చలు, సూచనలు, సిఫారసులు దేశవ్యాప్తంగా పిల్లల సైబర్ భద్రతకు మార్గదర్శకంగా నిలుస్తాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఉచిత న్యాయ సేవల కోసం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ వాహనాలను కేంద్ర మంత్రి, న్యాయమూర్తుల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రారంభించారు.

## ‘సత్యాగ్రహ’తో రాహుల్ నయా ట్రెండ్!

ఈ సత్యాగ్రహ పోర్టల్‌లో తమ నిరసనలు, ఉద్యమానికి సంబంధించిన వివరాలను ప్రజలు నమోదు చేసుకోవచ్చని రాహుల్ గాంధీ సూచించారు. ఉద్యమం ఏ అంశంపై జరుగుతోంది ఎవరు నిర్వహిస్తున్నారు వంటి వివరాలను నమోదు చేస్తే అవి డిజిటల్ మ్యాప్‌లో కనిపించేలా ఈ సత్యాగ్రహ వేదికను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ప్లాట్‌ఫామ్‌లో 150కిపైగా వివరాలు నమోదైనట్లు తెలుస్తోంది. భూమి సమస్యలు, మహిళల హక్కులు, దళితులు, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షలు వంటి అంశాలపై దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ తెలిపారు.ఇలాంటి ఉద్యమాలన్నింటినీ ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి ఒకే అంశంపై పోరాడుతున్న ఇతర వ్యక్తులు, సంఘాలతో వారిని అనుసంధానం చేయడమే లక్ష్యమని రాహుల్ గాంధీ వివరించారు. ‘మీరు కూడా ఏదైనా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే మీ కథను పంచుకోండి. మీ నిరసన ఈ మ్యాప్‌లో చోటు పొందుతుంది. మీలాంటి సమస్యపై ఎవరు పోరాడుతున్నారో కూడా తెలుసుకోవచ్చు’ అని రాహుల్ గాంధీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.దేశవ్యాప్తంగా సత్యాన్ని అణచివేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. వివిధ ప్రాంతాల్లో అనేక నిరసనలు జరుగుతున్నాయని వాటిని ఒకచోట చేర్చి సంబంధిత ఉద్యమకారులతో కలిసి పనిచేయాలనేది తన ఉద్దేశమని వీడియో సందేశంలో రాహుల్ గాంధీ తెలిపారు. మహాత్మా గాంధీని ప్రస్తావిస్తూ సత్యమే మన గొప్ప ఆయుధమని, అయితే సత్యం పక్షాన ప్రజలంతా కలిసి నిలబడటం మరింత శక్తివంతమైనదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తమ సమస్యలపై పోరాడుతున్న వారు ‘సత్యాగ్రహ’ వెబ్‌సైట్‌లో ఫారం నింపి తమ ఉద్యమాన్ని నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అవసరమైన చోట పార్లమెంటులో, వీధుల్లో, లేఖల ద్వారా వారి తరఫున తన వంతు కృషి చేస్తానని రాహుల్ గాంధీ తెలిపారు. ప్రతిపక్ష నేతగా ప్రజలకు అండగా నిలవడం తన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సత్యాగ్రహ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా జరుగుతున్న వివిధ నిరసనల వివరాలను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు ఒకే సమస్యపై పోరాడుతున్న ఉద్యమకారుల మధ్య అనుసంధానం పెంచే ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

## టెక్నాలజీ రంగంలో ఏపీకి కొత్త గుర్తింపు

తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

### అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన ‘అమరావతి డిక్లరేషన్’ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

### క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ “గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది” అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు ‘420’ అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అక్టోబర్ 10 నుంచి బతుకమ్మ వేడుకలు

చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాయంలో సీఎస్ సంజయ్ జాజు ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 18 వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టుగా చెప్పారు. ఈ నెల 18 వ తేదీన ‘సద్దుల బతుకమ్మ’ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టుగా తెలిపారు. వేలాది మంది మహిళలతో సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని ఆయన వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆయన ఆదేశించారు.

నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్‌పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.బతుకమ్మల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగేందుకు నెక్లెస్ రోడ్డు, బతుకమ్మ ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్‌తో పాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. సాయంత్రం 5 గంటల నుంచి 10 గంటల వరకు ట్యాంక్ బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్, ఇతర ఏర్పాట్లు చేపట్టాలని ఉన్నతాధికారులకు సూచించారు.

రవీంద్ర భారతిలోనూ పది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను అధికారంగా నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు జరుగుతుంటాయి, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ, అధికార కాంగ్రెస్ నుంచి నేతలు బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి ఎదురైన సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నాయి. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రజల అభివృద్ధి కోసం అవసరమైన పనులు చేయకపోవడం వల్ల ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం మంచిదని కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. అంతేకాకుండా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ‘ఫ్యూచర్ సిటీ’ ప్రాజెక్టును ఆయన ‘ఫ్యూచర్ లేని సిటీ’గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏమిటి అని ఆయన మండిపడ్డారు. ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా, ప్రాజెక్టులపై దృష్టి పెట్టడం వల్ల ప్రజలలో అసంతృప్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు బీఆర్ఎస్‌లో చేరడం, ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, ప్రజల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన వివరించారు. ఈ పరిణామాలు రాజకీయ దృక్పథంలో పెద్ద మార్పును సూచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు, తమ పార్టీని వీడడం ద్వారా, బీఆర్ఎస్‌లో చేరడం అనేది తమ రాజకీయ భవిష్యత్తుకు సంబంధించి ఒక వ్యూహాత్మక నిర్ణయంగా భావిస్తున్నారు. ఈ మార్పులు, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దిశను చూపిస్తున్నాయి. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటే, కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు బీఆర్ఎస్‌లో చేరడం, పార్టీకి ఎదురైన సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ పరిణామాలు, రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాయి.

## ఆసుపత్రుల నిర్మాణాల్లో వేగం పెంచాలి

నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగంగా సాగాలని గతంలోనూ సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన పనులు 24 గంటలూ కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని సూచించారు.కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య ప్రాజెక్టుగా చేపట్టింది. ఆధునిక వైద్య సేవలకు అనుగుణంగా బిల్డింగ్, ల్యాబొరేటరీలు, ఇతర మౌలిక వసతులను రూపొందించడంతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలను ముందుగానే సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి గత సమీక్షల్లో ఆదేశించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే సమయానికి వైద్య సేవలు వెంటనే ప్రారంభమయ్యేలా ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

అవసరమైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల సంఖ్యను గుర్తించి నియామక ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా కొత్త ఆసుపత్రులకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. భవనాలు పూర్తయిన తర్వాత పరికరాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా, వరంగల్ టిమ్స్, అల్వాల్ టిమ్స్ , ఎల్బీనగర్ టిమ్స్, సనత్‌నగర్ టిమ్స్, నిమ్స్ వంటి ఆసుపత్రుల ద్వారా పెద్ద ఎత్తున పడకల సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికతో ముందుకెళ్తోంది. సుమారు రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 10 వేల పడకల సామర్థ్యాన్ని పెంచే ఆసుపత్రుల నిర్మాణం చేపడుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి గతంలో వెల్లడించారు.జిల్లా కలెక్టర్లు కేవలం కేవలం ఆఫీసులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను అధికారులు తప్పనిసరిగా సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో విద్య, వైద్య రంగాల పరిస్థితిపై వారానికి ఒకసారి సమీక్ష నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.విద్య, వైద్య రంగాల సమీక్షతో పాటు డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఏర్పాట్లపైనా సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో చర్చించారు. సమ్మిట్‌కు వచ్చే అతిథులు, పెట్టుబడులు, ఇతర ఏర్పాట్ల విషయంలో పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లను త్వరలో తానే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యాలను దృష్టిలో పెట్టుకుని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

## ఆరంభంలో తడబడినా ఆఖర్లో పతకాల సునామీ

### - 21 స్వర్ణాలతో టోటల్ 85 మెడల్స్ కొల్లగొట్టిన భారత్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆసియా క్రీడలు 2026లో భారత క్రీడాకారులు తమ పోరాటాన్ని అద్భుతమైన రికార్డుతో ముగించారు. శనివారం జరిగిన పురుషుల హాకీ ఫైనల్లో మలేసియాను చిత్తు చేసి సాధించిన స్వర్ణ పతకంతో భారత పతకాల వేట పరిసమాప్తమైంది. టోర్నీ ఆరంభంలో భారత ప్రదర్శన కాస్త నెమ్మదిగా సాగి, 2022 ఎడిషన్ కంటే చాలా తక్కువ పతకాలు వస్తాయేమోనన్న సందేహాలు కలిగినప్పటికీ, క్రీడలు ముగిసే సమయానికి భారత బృందం అనూహ్యంగా పుంజుకుంది. ముఖ్యంగా ఆర్చర్లు, బాక్సర్లు చివరి రోజుల్లో స్వర్ణాల పంట పండించారు. పురుషుల క్రికెట్ జట్టు, పురుషుల హాకీ జట్లు పసిడి పతకాలను అందించాయి. దీంతో ఇండియా మొత్తం 85 పతకాలతో తమ ప్రచారాన్ని ముగించింది. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు చేరాయి.

### 21 స్వర్ణాల పంట.. ఆర్చరీ బాక్సింగ్‌లలో తిరుగులేని జోరు

భారత్ సాధించిన 21 బంగారు పతకాలలో టీమ్ ఈవెంట్లు, వ్యక్తిగత విభాగాల ఆటగాళ్లు విశేషంగా రాణించారు. క్రికెట్‌లో మహిళల, పురుషుల జట్లు రెండూ స్వర్ణాలు కైవసం చేసుకున్నాయి.

కబడ్డీలోనూ పురుషులు, మహిళల జట్లు బంగారు పతకాలను నిలబెట్టుకున్నాయి. హాకీలో మహిళల జట్టు చైనాను, పురుషుల జట్టు మలేసియాను ఓడించి డబుల్ గోల్డ్ సాధించాయి. షూటింగ్‌లో కమల్‌జీత్, సురుచి సింగ్ ద్వయం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్‌లో, నీరు ధాండా వ్యక్తిగత ట్రాప్‌లో, కైనాన్ చెనాయ్ తో కలిసి మిక్స్‌డ్ ట్రాప్ విభాగంలో మూడు స్వర్ణాలు సాధించారు. ఆర్చరీలో ఏకంగా ఐదు స్వర్ణాలు నమోదయ్యాయి. తెలుగు ప్లేయర్లు జ్యోతి సురేఖ వెన్నం, చికీత తనిపర్తి తో పాటు ప్రీతిక ప్రదీప్‌లతో కూడిన మహిళల కాంపౌండ్ జట్టు, మిక్స్‌డ్ కాంపౌండ్ జట్టు, సాహిల్ జాదవ్, గణేష్ మణి రత్నం, కుశాల్ దలాల్‌లతో కూడిన పురుషుల కాంపౌండ్ జట్టు పసిడిని సాధించాయి. అంకిత భకత్, కుంకుమ్ మొహోద్, కీర్తి శర్మల మహిళల రికర్వ్ జట్టుతో పాటు వ్యక్తిగతంగా కుంకుమ్ మొహోద్ స్వర్ణం గెలిచింది. అథ్లెటిక్స్ మహిళల 4x400 మీటర్ల రిలే జట్టు, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహైన్, పర్వీన్ హుడా, అంకుష్ పసిడి సాధించారు. రెజ్లింగ్‌లో సుజీత్, అమన్ సెహ్రావత్, గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ స్వర్ణాలు గెలిచారు.

### 27 రజతాలతో మెరుపులు.. షూటింగ్ అథ్లెటిక్స్‌లో పోరాటం

భారత ఖాతాలో 27 రజత పతకాలు వచ్చి చేరాయి. షూటింగ్‌లో ఎలావెనిల్ వలరివాన్, రుద్రాంక్ష్ పాటిల్, హిమాన్షు ధిల్లాన్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, ఇషా సింగ్‌లు టీమ్, వ్యక్తిగత విభాగాల్లో రజతాలు అందించారు. అథ్లెటిక్స్‌లో గుల్వీర్ సింగ్ 10 వేల మీటర్లు, 1500 మీటర్లలో రెండు రజతాలు సాధించగా, సావన్ బెర్వాల్, తజిందర్‌పాల్ సింగ్ తూర్, ఆన్సీ సోజన్, సర్వేష్ కుశారే, మురళీ శ్రీశంకర్, యశ్ వీర్ సింగ్‌లు రజతాలు గెలిచారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను, రెజ్లింగ్‌లో నితీష్ సివాచ్, అంతిమ్ పంగల్, స్క్వాష్‌లో అభయ్ సింగ్, అనాహత్ సింగ్ లు రజతాలు అందుకున్నారు.

### 37 కాంస్యాలతో సత్తా.. సమష్టి కృషితో టాప్ ప్రదర్శన

భారత్ 37 కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. అథ్లెటిక్స్‌లో పారుల్ చౌదరి, మన్‌ప్రీత్ కౌర్, తేజస్విన్ శంకర్, విద్యా రామ్‌రాజ్, పూజా సింగ్ లు కాంస్యాలు సాధించారు. బ్యాడ్మింటన్ పురుషుల జట్టు, టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో దియా చితాలే, మానుష్ షా జోడీ, సెపక్ తక్రా, సెయిలింగ్‌లో నేత్ర కుమారన్, బాక్సింగ్‌లో నరేందర్ బెర్వాల్, ప్రియా గంగస్, కపిల్ పోఖరియాలు కాంస్యాలు గెలిచారు.

## శ్రీసిటీ పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదం

మరొకరు కూడా మరణించడంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరోవైపు ఈ ప్రమాదంలో గాయపడిన పలువురు సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ప్రకటించారు.శ్రీసిటీలోని ప్రమాద స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడులు పరిశీలించి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంంకటేశ్వర్ మాట్లాడుతూ టిల్ పరిశ్రమంలో శనివారం ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో 2 టన్నుల బాయిలర్ పేలిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు మరణించారని చెప్పారు. మరణించిన వారిలో ఒకరు బాయిలర్ ఆపరేటర్, ఇద్దరు ఈటీపీ కార్మికులు, మరో ఇద్దరు వివిధ వర్క్స్ చేస్తున్నవారు ఉన్నారని తెలిపారు. వీరిలో ఒకరు కోల్‌కతాకు చెందినవారు, ఇద్దరు తమిళనాడు వాసులు కాగా, మిగిలిన ఇద్దరు స్థానిక తడ, చెరివి ప్రాంతాలకు చెందినవారని చెప్పారు.ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ మొత్తం అందజేయడం జరుగుతుందని చెప్పారు. మృతుల పిల్లల ఉన్నత విద్యతో పాటు విద్యా ఖర్చులను శ్రీసిటీ యాజమాన్యం భరించనుందని, అర్హులైన కుటుంబ సభ్యులకు శ్రీసిటీ లేదా పరిసర పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టుగా చెప్పారు.ఈ ప్రమాదంపై ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టుగా ఆయన తెలిపారు. టిల్ కంపెనీపై కూడా కేసు నమోదు చేసినట్టుగా చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన తిరుపతి బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసినట్టుగా తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. శ్రీసిటీ ఏర్పాటు చేసి 18 ఏళ్లు అయిందని అయితే ఇన్నేళ్లలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇదే తొలిసారి అని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా శ్రీసిటీలోని అన్ని కంపెనీల్లో తక్షణమే థర్డ్-పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని శ్రీసిటీ ఎండీకి తెలియజేశామని చెప్పారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ శాంతి చొరవ

### - మోదీ ప్రతిపాదనపై ఉక్రెయిన్ ప్రశంసలు!

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు దౌత్య ప్రయత్నాలు మరోసారి ఊపందుకున్నాయి. ఈసారి భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ నుంచి కీలక స్పందన వచ్చింది. కాల్పుల విరమణ కోసం తమకు నాలుగు ప్రతిపాదనలు అందాయని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహా తెలిపారు. భారత్, అమెరికా, టర్కీ, ఈజిప్ట్ నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో.. భారత్ ప్రతిపాదన అత్యంత సమగ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

### భారత్ ప్రతిపాదనలో ఏముంది?

భారత్ ప్రతిపాదన వివరాలను పూర్తిగా బయటపెట్టలేదు. అయితే ఉక్రెయిన్ ప్రకారం ఇంధన రంగంతో పాటు నల్ల సముద్రంలో కాల్పుల విరమణకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంధన కేంద్రాలు, ఓడరేవులపై దాడులు నిలిపివేయడం కూడా కీలక అంశంగా ఉంది. నల్ల సముద్రంలో నౌకాయానం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సజావుగా సాగేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.

### నాలుగు ప్రతిపాదనలు

రష్యా-ఉక్రెయిన్ కాల్పుల విరమణ కోసం ప్రస్తుతం నాలుగు దౌత్య ప్రతిపాదనలు చర్చలో ఉన్నాయి. టర్కీ, ఈజిప్ట్ కలిసి నల్ల సముద్రంలో ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలు కల్పించే సంధిని ప్రతిపాదించాయి. అమెరికా ఇంధన మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడంపై దృష్టి పెట్టింది. భారత్ ప్రతిపాదన మాత్రం ఇంధన రంగం, నల్ల సముద్రం అంశాలను కలిపి చూస్తోంది.

### ఉక్రెయిన్ ఏం చెబుతోంది?

కాల్పుల విరమణలో ఇంధన రంగం, నల్ల సముద్రం రెండూ కలిసే ఉండాలని ఉక్రెయిన్ కోరుతోంది. ఓడరేవులు సహా అన్ని ఇంధన మౌలిక వసతులపై దాడులు పూర్తిగా ఆగాలని సిబిహా స్పష్టం చేశారు. అదే సమయంలో యుద్ధ ప్రాంతం వెంట షరతులు లేని కాల్పుల విరమణను కూడా పరిశీలించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని తెలిపారు.

### మోదీపై పుతిన్ ప్రశంసలు

ఈ పరిణామాల మధ్య రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ప్రధాని నరేంద్ర మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశాన్ని మోదీ పదేపదే ప్రస్తావిస్తున్నారని ఇటీవల ఓ కార్యక్రమంలో చెప్పారు. ఇరువైపులా ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. శాంతియుతంగా, త్వరగా సమస్య పరిష్కారం కావాలని మోదీ కోరుతున్నారని పుతిన్ అన్నారు.

### ముందున్న సవాలు ఏంటి?

భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ సానుకూలంగా స్పందించినా.. కాల్పుల విరమణ అమలుకు రష్యా అంగీకారం కూడా కీలకం. ప్రస్తుతం నాలుగు ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయి. వాటిలో ఏది ఆచరణలోకి వస్తుందన్నది రాబోయే దౌత్య చర్చలపై ఆధారపడి ఉంటుంది.

## అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవా

**సికింద్రాబాద్.** అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పట్టభద్రులకు సూచించారు. బేగంపేట్, రాంగోపాల్ పేట్ డివిజన్లలో తలసాని పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ నిచ్చారు. దేవిడిలో 50లక్షలతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ పైప్ లైన్ పనులను తలసాని నేడు ప్రారంభించారు. అనంతరం రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. సభ్యత్వ నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసాని కి పలువురు గ్రాడ్యుయేట్ లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటు వేసిన గ్రాడ్యుయేట్ లు కూడా తప్పనిసరిగా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇంటింటికీ వెళ్ళి గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## కొలిమిగుండ్లలో పర్యటించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శనివారం రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటించారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు స్థానిక టిడిపి నాయకులు పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఒక్క రక్తపు చుక్కలో ఒక చిన్నారి జీవితం




తలసేమియాతో పోరాడుతున్న చిన్నారుల కోసం సమాజం మొత్తం ఒక్కటై నిలవాలి
ఒక చిన్నారి చేతిలో పుస్తకం ఉండాలి.
భుజంపై పాఠశాల సంచి ఉండాలి.
ఆట మైదానంలో పరుగెత్తాలి.
తల్లిదండ్రుల ఒడిలో నవ్వుతూ ఆడుకోవాలి.
కానీ తలసేమియా అనే వంశపారంపర్య రక్తవ్యాధి వేలాది చిన్నారుల బాల్యాన్ని ఆసుపత్రులు, రక్తమార్పిడులు, మందులు, పరీక్షల మధ్యకు నెట్టేస్తోంది.
"అమ్మా... నాకు రక్తం ఎప్పుడు వస్తుంది?"
ఒక చిన్నారి నోటి నుంచి వచ్చే ఈ ప్రశ్నను ఒక్కసారి మనసుతో వింటే చాలు---రక్తదానం విలువ ఏమిటో అర్థమవుతుంది.
తలసేమియా సాధారణ జ్వరం లేదా కొన్ని రోజుల్లో తగ్గిపోయే వ్యాధి కాదు. తీవ్రమైన తలసేమియా ఉన్న పిల్లల శరీరం తగినంత ఆరోగ్యకరమైన రక్తాన్ని తయారు చేయలేకపోతుంది. అందువల్ల వారికి వైద్యుల పర్యవేక్షణలో దీర్ఘకాలం క్రమం తప్పకుండా రక్తమార్పిడులు అవసరమవుతాయి.

**దాదాపు ఒక శతాబ్దం నాటి వైద్య సమస్య**

తలసేమియా కొత్తగా పుట్టిన వ్యాధి కాదు. 1925లో వైద్యుడు థామస్ బి. కూలీ చిన్నారుల్లో కనిపించిన తీవ్రమైన రక్తహీనత, ప్లీహా పెరుగుదల వంటి లక్షణాలను వివరించారు. ఆ తరువాత ఈ వ్యాధిపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరిగాయి. అయినా నేటికీ ఈ వ్యాధితో జీవిస్తున్న చిన్నారుల జీవితాల్లో రక్తం కోసం ఎదురుచూపు కొనసాగుతూనే ఉంది.

**భారతదేశంలో సమస్య తీవ్రత ఎంత?**

భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 10,000 నుంచి 15,000 మంది తీవ్రమైన తలసేమియాతో బాధపడే శిశువులు జన్మిస్తున్నారని అంచనా ఉంది.
అంటే సంవత్సరపు అంచనాను రోజులకు విభజిస్తే సగటున రోజుకు సుమారు 27 నుంచి 41 మంది శిశువులు అన్నమాట. ఇది ప్రత్యక్షంగా నమోదయ్యే రోజువారీ సంఖ్య కాదు; వార్షిక అంచనాను రోజులకు విభజించిన గణిత సగటు మాత్రమే.
కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2024లో దేశంలో దాదాపు ఒక లక్ష మంది తలసేమియా రోగులు ఉన్నారని, ప్రతి సంవత్సరం సుమారు 10,000 కొత్త కేసులు వస్తున్నాయని పేర్కొంది. మరో జాతీయ సంస్థ అంచనా ప్రకారం దేశంలో తీవ్రమైన తలసేమియాతో జీవిస్తున్న పిల్లలు సుమారు ఒక లక్ష నుంచి లక్షన్నర వరకు ఉండవచ్చు.
వేర్వేరు సంస్థలు వేర్వేరు పద్ధతుల్లో లెక్కించడం వల్ల గణాంకాల్లో తేడాలు కనిపిస్తున్నాయి.
ఇవి కేవలం గణాంకాలు కావు.
ప్రతి సంఖ్య వెనుక ఒక చిన్నారి ఉంది.
ఒక తల్లి ఉంది.
ఒక తండ్రి ఉన్నాడు.
ఒక కుటుంబం ఉంది.
ఒక జీవితం ఉంది.

**రక్తం కోసం ఎదురుచూసే చిన్నారి**

ఒక తల్లి తన బిడ్డను ఆసుపత్రికి తీసుకొస్తుంది.
ఇతర పిల్లలు పాఠశాలకు వెళ్తుంటే, ఆమె బిడ్డకు రక్తం ఎక్కించాల్సిన రోజు వచ్చింది.
రక్తంలోని హిమోగ్లోబిన్ స్థాయి తగ్గుతోంది.
చిన్నారి నీరసంగా ఉన్నాడు.
ఆడుకోవాలనే వయసులో మంచంపై పడుకున్నాడు.
తల్లి కళ్లు మాత్రం ఒక్కటే వెతుకుతున్నాయి---
"రక్తం దొరికిందా?"
అదే సమయంలో ఎక్కడో ఒక యువకుడు రక్తదానం చేస్తాడు.
అతనికి ఆ చిన్నారి ఎవరో తెలియదు.
ఆ కుటుంబం ఎవరో తెలియదు.
కానీ అతను ఇచ్చిన రక్తం పరీక్షలు, భద్రతా ప్రక్రియలు, వైద్యుల పర్యవేక్షణ అనంతరం అవసరమైన రోగికి చేరినప్పుడు, ఆ చిన్నారి జీవితంలో మరో ఆశాకిరణం వెలుగుతుంది.
నిన్నటి వరకు నీరసంగా ఉన్న కళ్లలో మళ్లీ వెలుగు కనిపిస్తుంది.
తల్లి గుండెల్లో భయం కొద్దిగా తగ్గుతుంది.
తండ్రి ఊపిరి పీల్చుకుంటాడు.
చిన్నారి మళ్లీ అడుగుతాడు---
"అమ్మా... నేను ఎప్పుడు పాఠశాలకు వెళ్తాను?"
ఆ ప్రశ్నకు అవకాశం కల్పించిన వారిలో ఒకరు---




ఒక రక్తదాత.

**హైదరాబాద్ వంటి మహానగరాల్లో మన బాధ్యత మరింత పెద్దది**

హైదరాబాద్‌లో తలసేమియా బాధితుల కోసం పనిచేస్తున్న సంస్థలు, రక్తకేంద్రాలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, రక్తదాతలు ఎంతో విలువైన సేవ చేస్తున్నారు.
అయితే ఇలాంటి సేవలకు నిరంతరంగా స్వచ్ఛంద రక్తదాతల భాగస్వామ్యం అవసరం.
దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం కోట్ల కొద్దీ రక్త పరిమాణాలు అవసరమవుతున్నాయి. 2024లో భారతదేశంలో సుమారు ఒక కోటి 46 లక్షల రక్త పరిమాణాలు సేకరించబడ్డాయి. అందులో 74.55 శాతం స్వచ్ఛంద రక్తదానం ద్వారా సేకరించబడింది.
అయినప్పటికీ అవసరమైన సమయంలో సురక్షితమైన రక్తం అందుబాటులో ఉండటం నిరంతర ప్రజారోగ్య అవసరంగానే ఉంది.
అందుకే హైదరాబాద్‌లోని ప్రతి కళాశాల, ప్రతి కార్యాలయం, ప్రతి పరిశ్రమ, ప్రతి సంఘం, ప్రతి సేవా సంస్థ, ప్రతి యువజన సమూహం---
"రక్తదానం మన సామాజిక బాధ్యత" అనే భావనను ముందుకు తీసుకెళ్లాలి.
ఒక వ్యక్తి రక్తదానం చేయడం చిన్న పని అనిపించవచ్చు.
కానీ వేలమంది యువకులు, యువతులు, పౌరులు తమకు వైద్యపరంగా అనుమతించబడినప్పుడు క్రమం తప్పకుండా స్వచ్ఛంద రక్తదానం చేస్తే, అవసరమైన రోగులకు రక్తం అందుబాటులో ఉండేలా చేయడంలో అది ఎంతో పెద్ద సామాజిక సహకారంగా మారుతుంది.

**తలసేమియా చిన్నారులకు రక్తదానం అంటే ఏమిటి?**

అది కేవలం ఒక సీసా రక్తం కాదు.
అది---
ఒక తల్లికి ధైర్యం.
ఒక తండ్రికి ఊరట.
ఒక చిన్నారికి మరో రోజు.
మరో రోజు అంటే మరో పాఠశాల రోజు కావచ్చు.
మరో పుట్టినరోజు కావచ్చు.
మరో కల కావచ్చు.
అందుకే రక్తదానం జీవనానికి అండగా నిలిచే మానవతా కార్యం.
అయితే తలసేమియాను ఎదుర్కోవడానికి రక్తదానం ఒక్కటే మార్గం కాదు. ముందస్తు గుర్తింపు, తలసేమియా వాహకుల పరీక్షలు, జన్యు సలహా, సమగ్ర వైద్య సంరక్షణ, అవసరమైన వారికి మూలకణ మార్పిడి వంటి వైద్య విధానాలు కూడా ముఖ్యమైనవి.

**రక్తదానం చేసే ప్రతి చేతికి అభినందనలు**

తమ రక్తాన్ని ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా దానం చేస్తున్న ప్రతి రక్తదాతకు హృదయపూర్వక అభినందనలు.
రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న సంస్థలకు అభినందనలు.
రక్తకేంద్రాల్లో సేవలందిస్తున్న సిబ్బందికి అభినందనలు.
తలసేమియా బాధిత చిన్నారుల కోసం నిరంతరం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు అభినందనలు.
వారి సేవ వల్ల ఎన్నో కుటుంబాల్లో ఆశ నిలుస్తోంది.
రక్తదాత తన పేరు చెప్పకపోయినా, అతని మానవత్వం ఒక చిన్నారి జీవితంలో కనిపిస్తుంది.

**ప్రతి యువకుడికీ, ప్రతి పౌరుడికీ ఒక పిలుపు**

మనకు ఆరోగ్యం ఉన్నప్పుడు మన రక్తం మన శరీరంలో ప్రవహిస్తుంది.
అదే రక్తాన్ని వైద్యపరంగా మనం దానం చేయగలిగినప్పుడు, అవసరమైన మరొకరి శరీరంలోకి చేరి వారి జీవనపోరాటానికి తోడ్పడుతుంది.
అందుకే రక్తదానం చేయండి.
కానీ ఎల్లప్పుడూ గుర్తింపు పొందిన రక్తకేంద్రం లేదా అధికారిక రక్తదాన శిబిరం ద్వారా, వైద్యుల సూచనలు మరియు అర్హత ప్రమాణాలను పాటిస్తూ రక్తదానం చేయాలి.
రక్తదానం చేసిన ప్రతి రక్త పరిమాణాన్ని పరీక్షించి, సురక్షితమైన రక్తసేవల వ్యవస్థ ద్వారా అవసరమైన రోగులకు అందించడం అత్యంత ముఖ్యం.
తలసేమియాతో పోరాడుతున్న చిన్నారి తన వ్యాధిని ఎంచుకోలేదు.
అతను ఈ ప్రపంచంలోకి వచ్చినప్పుడు అతని చేతిలో ఒక కల మాత్రమే ఉంది---
"నేను కూడా అందరిలా జీవించాలి."
ఆ కల ఆరిపోకుండా కాపాడటం సమాజం యొక్క మానవతా బాధ్యత.
ఒక రక్తపు చుక్క ఒక్క రోజును మాత్రమే కాదు---ఒక చిన్నారి భవిష్యత్తుపై ఆశను నిలబెట్టగలదు.
ఒక రక్తదాత ఒక కుటుంబానికి అపరిచితుడై ఉండవచ్చు.
కానీ ఆ కుటుంబానికి అతను చేసిన సహాయం మాత్రం ఎప్పటికీ అపరిచితం కాదు.
"మన రక్తం మన జీవితంలో ప్రవహించే జీవధార; అదే రక్తం మరొకరి జీవితంలోకి చేరినప్పుడు అది ఆశకు ఆధారం."
తలసేమియా బాధిత చిన్నారుల జీవితాల్లో వెలుగు ఆరిపోకుండా---రక్తదానానికి మనమందరం ముందుకు రండి.

**సామాజిక బాధ్యతతో నా సందేశం**

సింహాచలం లక్ష్మణ స్వామి
వ్యవస్థాపక అధ్యక్షుడు
ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం
కవి । రచయిత । ప్రకృతి ప్రేమికుడు । పర్యావరణ పరిరక్షకుడు । మానవతావాది

తలసేమియాతో పోరాడుతున్న చిన్నారుల జీవితాల్లో ఆశను నిలబెట్టడం కేవలం రక్తదానం కాదు---మానవత్వాన్ని ఆచరణలో చూపించే సామాజిక బాధ్యతగా నేను భావిస్తున్నాను. చిన్నారుల జీవితాలు రక్తం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రాకుండా చేయడానికి అవగాహన కల్పించడం, స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం నా వంతు సామాజిక బాధ్యతగా భావిస్తూ ఈ మానవతా ప్రచారానికి ముందుకు వస్తున్నాను.
"ఒక చిన్నారి చిరునవ్వు ఆరిపోకుండా ఉండేందుకు,
ఒక కుటుంబం ఆశ కోల్పోకుండా ఉండేందుకు,
మన రక్తంలో కొంత భాగాన్ని మానవత్వం కోసం అందిద్దాం."

**--- సింహాచలం లక్ష్మణ స్వామి**




# విజయవాడ ఉత్సవ్‌కు ఘనంగా ఏర్పాట్లు

## ఐదు వేల మంది కళాకారులతో కార్నివాల్.. డ్రోన్, లేజర్, క్రాకర్ షోలు

విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ ఉత్సవ్‌ను గత ఏడాది కంటే భిన్నంగా, వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో 'స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' ఉద్యమం విజయవంతంగా సాగుతోందని పట్టాభిరామ్ తెలిపారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జరిగిన 'స్వచ్ఛథాన్'కు విశేష స్పందన లభించిందన్నారు. 22 రాష్ట్రాల నుంచి 10 వేల మందికిపైగా మారథాన్‌లో పాల్గొన్నారని తెలిపారు.పున్నమి ఘాట్, ఎంబీకే స్టేడియం, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల తదితర ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సరస్సు మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్, క్రాకర్, లేజర్ షోలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యువత కోసం వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.రాష్ట్రపతి రాకవిజయవాడ ఉత్సవ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నట్లు పట్టాభిరామ్ తెలిపారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌కు లక్షలాది




మంది తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాల నిర్వహణకు పలు సంస్థలు, వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నారని తెలిపారు.స్వచ్ఛథాన్‌ను విజయవంతం చేసిన ప్రజలు అదే స్ఫూర్తితో విజయవాడ ఉత్సవ్‌ను కూడా విజయవంతం చేయాలని పట్టాభిరామ్ కోరారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనతో పాటు

# ముందస్తు గుర్తింపే కీలకం

**నంద్యాల** రొమ్ము క్యాన్సర్‌పై మహిళల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందేలా చైతన్యం తీసుకురావడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు శనివారం నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ నుంచి టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు నిర్వహించిన పింక్ మారథాన్ ర్యాలీని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, కలెక్టర్ ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, మహిళల్లో కనిపించే ముఖ్యమైన క్యాన్సర్‌లలో రొమ్ము క్యాన్సర్ ఒకటని, దీనిపై ప్రతి మహిళకు అవగాహన ఉండటం అత్యంత అవసరమన్నారు. కుటుంబ బాధ్యతలు, ఇంటి పనుల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. రొమ్ము భాగంలో గడ్డలు, అసాధారణ నొప్పి, చర్మంలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి గడ్డ క్యాన్సర్‌ను సూచించదని, అనవసర భయాలకు లోనుకాకుండా వైద్యుల సలహా తీసుకుని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. మహిళలు క్రమం తప్పకుండా స్వీయ పరిశీలన చేసుకోవడంతో పాటు, వైద్యుల సూచన మేరకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీ కోరారు. భయం, బిడియంతో ఆరోగ్య సమస్యలను దాచిపెట్టకుండా కుటుంబ సభ్యులతో చర్చించి, అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించడం ద్వారా వ్యాధిని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంలో భాగంగా మామోగ్రఫీ, సోనోమామోగ్రఫీ వంటి పరీక్షలకు రాయితీలు అందుబాటులో ఉన్నాయని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు.నంద్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆధునిక వైద్య సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యతపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పింక్ మారథాన్‌లో మహిళా, పురుష వైద్యులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పింక్ క్యాప్‌లు ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై పోరాటానికి తమ సంఘీభావాన్ని చాటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత, ఐక్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమం నిలిచిందన్నారు. పింక్ మారథాన్‌ను నిర్వహించిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా హాజరైన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రపంచ విజేతలైన అంధుల మహిళా క్రికెట్ జట్టుకు నేడు ఘన సన్మానం

## - 16 మంది ప్రపంచకప్ విజేతలకు ఘన స్వాగతం..

## - రూ.10 లక్షల ఆర్థిక సాయం




**విశాఖపట్నం, అక్టోబర్ 3** అంధుల మహిళా క్రికెట్ ప్రపంచకప్ 2025ను సాధించి దేశ కీర్తిని ప్రపంచ వేదికపై చాటిన 16 మంది మహిళా క్రికెటర్లకు ఆదివారం మంగళ పాలెం వద్ద శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించనున్నట్లు శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు తెలిపారు.శనివారం వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచకప్ విజేతలైన ఈ క్రీడాకారిణులు తొలిసారిగా పూర్తి జట్టుగా విశాఖకు వస్తున్నారని తెలిపారు.

**భోగాపురం విమానాశ్రయంలో ఘన స్వాగతం**ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 16 మంది క్రీడాకారిణులు శనివారం సాయంత్రం 4 గంటలకు భోగాపురం విమానాశ్రయానికి చేరుకోనున్నారని, అక్కడ వారికి ఘన స్వాగతం పలికి గ్రీన్ పార్క్ హోటల్‌కు తీసుకువెళ్తామని తెలిపారు. సాయంత్రం ఏపీ బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ బృందంలో అసోం, రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు ఉన్నారని తెలిపారు.

**ఒక్కొక్కరికి రూ.50 వేల ఆర్థిక సాయం** ఆదివారం ఉదయం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్‌ను క్రీడాకారిణులు సందర్శిస్తారని జగదీష్ బాబు తెలిపారు. షిప్‌యార్డ్ సహకారంతో ప్రతి క్రీడాకారిణికి రూ.50 వేల చొప్పున, అసోసియేషన్‌కు రూ.2 లక్షల చెక్కులను అందజేస్తామని చెప్పారు. మొత్తం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు.అనంతరం సాయంత్రం క్షత్రియ సేవా సమితి హాల్‌లో విశాఖ ప్రజల సమక్షంలో ప్రపంచకప్ విజేతలకు ఘన సన్మానం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు, ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు విష్ణుకుమార్ రాజు, కమిషనర్ భక్షి, జిల్లా కోర్టు జడ్జి ప్రదీప్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన

# జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్

**ఏలూరు** రానున్న లోకల్ బాడీ ఎన్నికల నేపథ్యంలో, ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఏలూరు పట్టణం లోని పలు పోలింగ్ కేంద్రాలను పోలీసు మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఏలూరు పట్టణంలోని చేపల మార్కెట్ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రం మరియు 12 పంపుల సెంటర్ లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్ లను ఎస్పీ గారు స్వయంగా తనిఖీ చేసి, అక్కడ ఉన్న వసతులను పరిశీలించారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా పోలీసు యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉంటుందని, శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు లోపలికి రావడానికి, తిరిగి బయటకు వెళ్లానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ఉండేలా అధికారులకు తగిన సూచనలు, సలహాలు జారీ చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేవారు మరియు రౌడీ షీటర్లపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఇప్పటికే దాదాపు 60 శాతం పోలింగ్ స్టేషన్ల పరిశీలన పూర్తయిందని వెల్లడించారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, వన్ టౌన్ ఎస్సై సుధాకర్, టూ టౌన్ ఎస్సైలు మధు వెంకట రాజా, రామకృష్ణ మరియు ఇతర పోలీస్, రెవెన్యూ/ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 5 నుంచి జిల్లా కళాకారుల క్రికెట్ పోటీలు

**విశాఖపట్నం,** : విశాఖపట్నం జిల్లా కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ సెన్సార్ బోర్డు సభ్యుడు, సంఘ సేవకుడు జి.వి. రామచంద్రరావు తెలిపారు.శనివారం డాబా గార్డెన్స్ ప్రెస్ క్లబ్‌లో క్రికెట్ పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ కళాకారులు, మీడియా ప్రతినిధులకు ఆటవిడుపుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.సంఘం గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సాహంగా జరుగుతాయన్నారు. ఉగాది సందర్భంగా జిల్లాలో ప్రతిభావంతులైన కళాకారులను ఎంపిక చేసి పురస్కారాలు అందజేస్తామని తెలిపారు.అంతర్జాతీయ కొరియోగ్రాఫర్, సీనియర్ జర్నలిస్టు ఆర్. నాగరాజ్ పట్నాయక్, సంఘం అధ్యక్షుడు ఖ్యాలు జనార్ధన్, బ్రహ్మకుమారి రామేశ్వరి, కందుకూరి అవార్డు గ్రహీత ఎం. శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ

**- ఇందుకూరు పంచాయతీ ఎం.రావిలంక గ్రామంలో కార్యక్రమం**



**దేవీపట్నం** ఇందుకూరు పంచాయతీ పరిధిలోని ఎం.రావిలంక గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు. రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చవలం శివరామకృష్ణ పీసా ఉపాధ్యక్షురాలు కొమరం చెల్లయమ్మ పిసా కార్యదర్శి పోలోజు సుబ్బారావు. జనసేన కార్యకర్త పోలోజు చక్కెర రావు. పీ.వీ రమణ . సంకురమ్మ హాజరై రైతులకు పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ అధికారులు విఆర్ఓ వెంకటలక్ష్మి కే.పద్మ. రామయ్య.. కార్యక్రమంలో పాల్గొనిఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతగా పరిష్కరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు..

## గ్రామ సేవకులకు పే స్కేల్ అమలు చేయాలి.

**- సీఐటీయూ డిమాండ్.**

**కొత్తపల్లి** గ్రామ రెవెన్యూ సహాయకుల కొత్తపల్లి మండల జనరల్ బాడీ సమావేశం మండల



అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షతన జరిగినది. సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షులు కలాం భాష సిఐటియు మండల కార్యదర్శి దినేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో రెవెన్యూ పరిపాలన కు సహాయకులుగా పనిచేస్తూ గ్రామంలో భూములు రెవెన్యూ రికార్డులు పంటలు పన్నులు చెస్సులు ప్రకృతి విపత్తులు తదితర పనులలో రెవెన్యూ అధికారులకు సహాయం చేస్తూ గ్రామీణ సమాచారాన్ని మొత్తం అందిస్తున్నారు. తరతరాలుగా గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ సేవకులకు నేటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు . ప్రభుత్వం వెంటనే పే స్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు కేవలం 10500 రూపాయలతో కుటుంబాలను పోషించుకుంటూ నిత్యం ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి పాలకులు మారుతున్నారు గ్రామ రెవెన్యూ సహాయకుల జీవితాల్లో మాత్రం ఏ మాత్రం మార్పు లేదు. కొత్త ప్రభుత్వం వచ్చినప్పుడల్లా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో ఎదురుచూస్తున్నారు.

కానీ నిరాశకు గురి అవుతున్నారు. గ్రామ సేవకులకు కనీస వేతనాలు అమలు చేయాలి వీఆర్ఏలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని సేవాకాలాన్ని పరిగణలోకి తీసుకొని ప్రమోషన్లు జీతం పెంచాలని డిఏవంటే ప్రయోజనాలు కల్పించాలని డి ఎ వంటి ప్రయోజనాలు కల్పించాలి కుటుంబానికి రక్షణ కల్పించే పెన్షన్ అమలు చేయాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి అర్హత ఉన్న వీఆర్ఏలకు ఆ శాఖలో పదోన్నతులు కల్పించాలని వారి డిమాండ్ చేశారు తెలంగాణ మాదిరిగా వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి . ఈ.ఎస్.ఐ పిఎఫ్ ఆధ్వర్యంలో కల్పించాలి , ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలి పదవీ విరమణ ప్రయోజనాలు అమలు చేయాలి పని భారాన్ని తగ్గించాలని వారు కోరారు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న గ్రామ సేవకులకు గౌరవ వేతనం పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న ప్రభుత్వాలు వెంటనే వేతనాలు పెంచి ఇతర సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సలాం విజయుడు అమ్మని మద్దిలేటి ఈలమ్మ శంకర్ నాగన్న షాజహా మియాస ఓబులేసు నాగన్న మండలంలోని గ్రామ సేవకులు అందరూ ఈ సమావేశంలో పాల్గొన్నారు

## ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి



**కొత్తపల్లి :** ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26వేలు మరియు చట్టబద్ధమైన సెలవులు ఇవ్వాలని ఇవ్వాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం కొత్తపల్లి మండల కన్వీనర్ కే దినేష్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తపల్లి ,ఎర్రమటం పి హెచ్ సి నందు అక్టోబర్ 6వ తేదీన జరిగే ఆశా డేను అదే నెలలో మరొక తేదీన జరపాలని కోరుతూ వైద్యాధికారి డాక్టర్.దీపనాగమణి, డాక్టర్.గులాబ్షా కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలని, చట్టబద్ధమైన సెలవులు కల్పించాలన్నారు. ఆశాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి 5వ తేదీన ఆశా వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఒప్పంద పత్రాల జీవోలును వెంటనే ఇవ్వాలన్నారు. ఆశాలకు పని భారాన్ని తగ్గించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని పెరుగుతున్న జనాభా కనుగుణంగా ఆశాల సంఖ్యను పెంచాలన్నారు. మాత శిశు సంరక్షణ పేరుతో నియమింపబడిన ఆశ వర్కర్స్ తో ప్రభుత్వము ఎల్లవెల్లాల పనులు చేయిస్తున్నది గర్భవతులు బాలింతలు పసిపిల్లల ఆరోగ్య సంరక్షణకు మోటివేట్ చేస్తే చాలు అనే పేరుతో నియమించి అన్ని రకాలైన పనులు ఊపిరి సలపకుండా చేస్తున్నారు. సర్వేల పేరుతో పని భారాన్ని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఆశాలకు సంబంధం లేని సిబ్బంది చేయాల్సిన పనులు సైతం బలవంతంగా బెదిరించి చేస్తున్నారు. పండగలు తుఫానులు వరదలు, పరీక్షలు ఎన్నికల సందర్భంగా కూడా టీఏడీఏలు చెల్లించకుండా పనిచేయిస్తున్నారు. 20 ఏళ్లుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించడం లేదు కార్మికులుగా గుర్తించడం లేదు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు జరపడం లేదు అనారోగ్యం పాలైన కుటుంబంలో ఎవరికైనా సుస్థి చేసినా సెలవులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఆశా కార్యకర్తలకు గ్రూప్ ఇన్సూరెన్స్ 10 లక్షలు ఇవ్వాలని, కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రమాదేవి, సోమేశ్వరి, లలితమ్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులే కేంద్రంగా దసరా ఏర్పాట్లు

**- ఏఐ డిస్‌ప్లే బోర్డులు.. క్రౌడ్ అనలిటిక్స్‌తో పర్యవేక్షణ - 3,500 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు..**

**- 22 పార్కింగ్ కేంద్రాలు - 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ కేంద్రం**

విజయవాడ(ప్రశ్న న్యూస్) దసరా మహోత్సవాలకు తరలివచ్చే సామాన్య భక్తులే కేంద్రంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులకు భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనం కల్పించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు.శనివారం అధికారులు సీతమ్మవారి పాదాలు, కేశఖండనశాల, హోల్డింగ్ ఏరియాలు, వినాయక టెంపుల్, రథం సెంటర్, టోల్‌గేట్, ఘాట్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### సమాచారానికి ఏఐ డిస్‌ప్లేలు

భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ఏఐ ఆధారిత డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా ఉత్సవాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, రాష్ట్రపతి పర్యటనను దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు.

### క్రౌడ్ అనలిటిక్స్‌తో నిఘా

2024 నుంచి దసరా ఉత్సవాల్లో సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ రాజశేఖరబాబు తెలిపారు. ఈసారి బూమ్ బ్యారియర్లు, యాక్సెస్ కంట్రోలర్లు తదితర సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నామన్నారు. మొత్తం 22 పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామని, 3,500 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. రద్దీని ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు క్రౌడ్ అనలిటిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

### స్వచ్ఛ దసరాకు ప్రాధాన్యం

దసరాకు వచ్చే భక్తులకు పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను విస్తృతంగా కల్పిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. రద్దీకి అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామన్నారు. స్వచ్ఛ దసరా స్ఫూర్తితో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



### ప్రత్యేక దర్శనాలకు ఏర్పాట్లు

దసరా సందర్భంగా ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. ఆలయంలో ఆధ్యాత్మిక శోభ ప్రతిబింబించేలా ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# స్వచ్ఛతే స్వర్ణాంధ్రకు సోపానం నదుల్లో వ్యర్థాలు వదలొద్దు

**- పరిశుభ్రతను అలవాటుగా మార్చాలి**

**- చెత్తను సమస్యగా కాదు.. సంపదగా**

**మార్చే విధానాలు: సీఎం చంద్రబాబు**

విజయవాడ(ప్రశ్న న్యూస్) పరిశుభ్రతను ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నదుల్లోకి వ్యర్థాలు, మురుగునీటిని వదలకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత, ఆలోచనల్లోనూ స్వచ్ఛత అవసరమన్నారు. ఐదు కోట్ల మంది ప్రజలు స్వచ్ఛతలో భాగస్వాములైతేనే రాష్ట్రంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విజయవాడలో గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. స్వచ్ఛతా వారియర్లు, స్వచ్ఛ గ్రామాలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, సంస్థలు, ఎన్జీవోలు తదితరులకు అవార్డులు అందజేశారు.

### నదులను కాపాడుకోవాలి

కృష్ణా, గోదావరి నదుల్లోకి వ్యర్థాలు, మురుగునీరు చేరకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీఎం అన్నారు. దిగువ ప్రాంతాల్లో ప్రజలు నదుల నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారని గుర్తుచేశారు. ఒక ప్రాంతంలో నదులు కలుషితమైతే దాని ప్రభావం ఇతర ప్రాంతాలపైనా పడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.





### స్వచ్ఛతతో ఆరోగ్యాంధ్ర

గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు స్వచ్ఛతకూ ప్రాధాన్యం ఇచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. పరిశుభ్రత ఏ ఒక్క వర్గానికో సంబంధించిన అంశం కాదని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను తామే శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని, తాను కూడా పాల్గొంటున్నానని చెప్పారు. రెండేళ్లలో రాష్ట్రంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు.

### చెత్తతో సంపద సృష్టి

చెత్తను సమస్యగా కాకుండా సంపద సృష్టించే వనరుగా చూడాలని సీఎం అన్నారు. వ్యర్థాలతో విద్యుత్తు, ఎరువులు, బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తూ సర్క్యులర్ ఎకానమీ వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ రథాలు, ఈ-ఆటోలు, పుష్‌కార్టులు, మెకనైజ్డ్ రోడ్ స్వీపింగ్ యంత్రాలతో ఘన వ్యర్థాల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు.జీరో గార్బేజ్ లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు, మ్యాజిక్ డ్రెయిన్లు, సోక్‌పిట్లు, కంపోస్ట్ పిట్లు, గోబర్ధన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

### తిరుమలకూ స్వచ్ఛత అవార్డు

స్వచ్ఛతా అవార్డుల్లో భాగంగా తిరుమల తిరుపతి ఆలయం, విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు అవార్డులు అందజేశారు. విశాఖ నోవోటెల్, పలు రైతు బజార్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, హాస్టళ్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు కూడా అవార్డులు సాధించాయి. కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య బలోపేతంతోనే విద్యారంగ సమస్యలకు పరిష్కారం

**- ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**

**- విద్యను వ్యాపార కేంద్రాలుగా మార్చే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

**- తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ ఏడవ జనరల్ బాడీ సమావేశంలో వక్తలు**





సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసినప్పుడే విద్యారంగంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ (టీపీఏ) నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహీంద్రా హిల్స్‌లోని త్రిమూర్తి కాలనీలో సంఘం అడ్వైజర్ పల్లెల వీరస్వామి అధ్యక్షతన శుక్రవారం టీపీఏ ఏడవ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యారంగ సమస్యలు, తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం, ప్రభుత్వ విద్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా పల్లెల వీరస్వామి, ప్రొఫెసర్ ఎస్. తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందిస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థ అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. విద్యా వ్యవస్థ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పదో తరగతి వరకు ప్రభుత్వ విద్యను తక్కువగా చూసే వారు, ఉన్నత చదువుల కోసం ప్రభుత్వ కళాశాలల వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారో ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ఆలోచించాలని సూచించారు.ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్య పేరుతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అధిక ఆర్థిక భారం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యత పెరిగితే ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల భారం నుంచి తల్లిదండ్రులకు ఉపశమనం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.సంఘం అడ్వైజర్ నాయకులు సతీష్, సీహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉచితంగా నాణ్యమైన విద్య అందే వరకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి సంబంధిత జీవో నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నాయకులు రామగిరి ప్రకాష్, ఎస్. ఆనంద్ మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యను అందించే కేంద్రాలుగానే ఉండాలే తప్ప వ్యాపార కేంద్రాలుగా మారకూడదన్నారు. పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ, బూట్ల విక్రయాలను వ్యాపారంగా నిర్వహించే పాఠశాలలపై అధికారులు తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.





### టీపీఏ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

సమావేశంలో తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం. అజయ్ బాబు, ప్రధాన కార్యదర్శిగా బి. రఫీదు, కోశాధికారిగా జే. తానిషా ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ ఎస్. తిరుపతి, రామగిరి ప్రకాష్, విజయ్, ఎస్. ఆనంద్, చంద్రమౌళి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా నర్సింగ్ రావు, ఏ. నాగరాజ్, ఎస్. అశ్విన్, రేణుక, సంధ్యలను ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా యాదగిరి, పరశురాములు, కిరణ్ కుమార్, ఏ.ఎన్. గిరి, స్వాతి ఎన్నికయ్యారు.ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం లక్ష్యంగా సంఘం ముందుకు సాగాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.

# ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, మెట్పల్లి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, సక్రమమైన పారిశుధ్య నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అదేవిధంగా వసతి గృహాల్లో అదనంగా నిర్మిస్తున్న వంటశాల, గదుల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పటివరకు ఎంత మేరకు పనులు పూర్తయ్యాయో, మిగిలిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేయవచ్చో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చడంతో పాటు, నిర్మాణంలో ఉన్న అదనపు సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, ఈఈ, పీఆర్ అధికారి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జై రాజ్, మండల తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భృగుబండకు విద్యుత్ వెలుగులు

**3311 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం**

**లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం: కన్నా లక్ష్మీనారాయణ**



సత్తెనపల్లి(ప్రశ్న న్యూస్) సత్తెనపల్లి రూరల్ మండలం భృగుబండ గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భృగుబండతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు.గతంలో గ్రామంలో లో-వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉండేదని, దీంతో వ్యవసాయ మోటార్లు కాలిపోవడం, రైతులు రాత్రివేళ విద్యుత్ సరఫరా కోసం ఇబ్బందులు పడటం జరిగేదని తెలిపారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యకు పరిష్కారంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి కృషి చేసినట్లు చెప్పారు.కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో భృగుబండతో పాటు పరిసర గ్రామాల్లో లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందడంతో పాటు గృహాలు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు.

## అభివృద్ధికి పునాది

33/11 కేవీ సబ్‌స్టేషన్ కేవలం విద్యుత్ కేంద్రం మాత్రమే కాదని, భృగుబండ అభివృద్ధికి ఇది పునాది అని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని విద్యుత్ రంగంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, మరిన్ని పనులు కొనసాగిస్తామని తెలిపారు.సబ్‌స్టేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసిన విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, సహకరించిన గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన వివిధ స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతులు, డ్వాక్రా సంఘాలకు విరివిగా రుణాలు

**జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన ఆదేశం**

**44 బ్రాంచ్‌ల పనితీరుపై సమీక్ష..**

**మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి**




గుంటూరు(ప్రశ్న న్యూస్) రైతులు, డ్వాక్రా సంఘాలకు జీడీసీసీ బ్యాంకు ద్వారా త్వరితగతిన, విరివిగా రుణాలు అందించాలని బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు బ్రాంచ్ మేనేజర్లను ఆదేశించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జీడీసీసీ బ్యాంకు 44 బ్రాంచ్‌ల మేనేజర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్‌తో పాటు సీఈఓ వీవీఎస్ ఫణికుమార్, సీనియర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ.. బ్యాంకు సేవల కోసం వచ్చే ప్రతి ఖాతాదారుడితో మర్యాదగా, సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. ఖాతాదారులకు అవసరమైన బ్యాంకింగ్ సేవలను సత్వరమే అందించాలని ఆదేశించారు. రైతులు, మహిళా సంఘాలు, ఇతర అర్హత కలిగిన ఖాతాదారులకు రుణ సౌకర్యాలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## మొండి బకాయిల వసూళ్లపై దృష్టి

బ్యాంకు సీఈఓ వీవీఎస్ ఫణికుమార్ మాట్లాడుతూ.. మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. బకాయిలను త్వరితగతిన వసూలు చేసి బ్యాంకు ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేయాలని అన్నారు. డిపాజిట్ల సమీకరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, బ్యాంకు వ్యాపారాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.సమావేశంలో 44 బ్రాంచ్‌ల పనితీరును బ్రాంచ్‌ల వారీగా సమీక్షించారు. రుణాల పంపిణీ, వ్యాపారాభివృద్ధి, మొండి బకాయిల వసూళ్లు, డిపాజిట్ల సమీకరణ తదితర అంశాలపై చర్చించారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు బ్రాంచ్ మేనేజర్లు, అధికారులకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను ఉన్నతాధికారులు అందించారు.

# సైన్యంలో చీడపురుగులు, ఇట్టే పట్టేసిన నగర పోలీసులు

**ఇంటి దొంగను ఈశ్వరుడు కూడాపట్టుకోలేడు అనే సామెతను నిజం చేయాలనుకున్న ఒక సిపాయి.**

**మనిషి ఆశలకు కోరికలకు అంతులేకుండా పోతున్నాయి, ఆ ఆశలను కోరికలను తీర్చుకోవటానికి ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో తప్పుడు దారిలో వెళ్లి , ఆ చేసేతపుడు పనులలో తనను తాను మరిచిపోయి ఎంత ఘాతకానికైనా వడికట్టడానికి పాల్పడుతున్నాడు.తాను ఒక సైనికుడే అనే సంగతి మరిచిపోయాడు . తాను చేసే నేరాలకు సమాజమే కాదు దేశ భవిష్యత్తు కూడా భంగం కలుగుతుందన్న సంగతి మరిచిపోతున్నాడు.**

**ఇందులో కక్షసాధింపు నేరాలు చాలా పెరుగుతున్నాయి, కోపం అనేది తాత్కాలికం కానీ కక్షసాధింపు చేర్యలలో విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారు.**

**ఇది ఇలా ఉండగా వెబ్సేరీస్ లు చూస్తున్న ప్రజలు వాటికి ఆకర్షితులు అయ్యి వాటిని ఆచరణలో పెట్టె పనులలో ఉంటున్నారు . రెండు తరాల క్రితం దేశభక్తి , మంచితనం , కుటుంబనేపధ్యంలో వచ్చే చిత్రాలు సమాజంపై ఎంతో ప్రభావం చూపించేవి, కానీ ప్రస్తుతం ఆధునిక పరిజ్ఞానం చెడుకి ఉపయోగించడంవల్ల పలు సమస్యలు తలెత్తడమే కాకుండా జీవితాలు తారుమారు అయితున్నాయి.**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న బోల్లారం ప్రాంతంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ లో గత నెల రోజుల క్రితం జరిగిన ఆయుధాలు చోరీ కేసులో కీలక విషయాలను నిన్న మల్కాజిగిరి జోన్ కార్యాలయంలో మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ బి సుమతి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో పోలీస్ కస్టడీలో సంచలన విషయాలు వెల్లడించిన నిందితుడు మల్లేష్.బొల్లారం పోలీసులు,ఆర్మీ అధికారుల సంయుక్త విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయని సుమతి తెలిపారు.

**ఆయుధాలు, మందుగుండు సామాగ్రి పై మల్లేష్ కు ఆర్మీలో శిక్షణ ఇచ్చిన ఆర్మీ అధికారులు.**

సైనిక అధికారులు ప్రతీకార ధోరణితో చూస్తూ పలుమార్లు శిక్షించడంతో అధికారుల పై కక్ష పెంచుకున్న మల్లేష్.16 సంవత్సరాల ఆర్మీ సర్వీస్ పూర్తి చేసిన తర్వాత మరో మూడు సంవత్సరాల సర్వీస్ అర్హత తనకు ఉన్నప్పటికీ, కమాండింగ్ ఆఫీసర్ లేదా సైనిక ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవహారాలు చూసే సహాయ అధికారి పరువుకు భంగం కలిగించేలా వ్యవహరించడంతో తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారన్న మల్లేష్ విచారణలో ఆవేదన వ్యక్తంచేశారు.అలాగే2007లో ఆమ్రాబాద్, అచ్చంపేట ప్రాంతాలలో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డ నిందితుడు మల్లేష్ 2009లో భారత ఆర్మీలో చేరిన మల్లేష్,దొంగతనాల కేసులో నిందితుడిగా ఉన్న విషయం ఆర్మీ అధికారుల దృష్టికి రాకుండా జాగ్రత్త పడ్డాడు.ఈ కేసులో కీలకమైన అంశం2022 వ సంవత్సరంలో కలకత్తాలోని బ్యారక్ పూర్ కంటోన్మెంట్ మిలిటరీ ప్రాంతంలో బెటాలియన్ లో విధులు నిర్వహించిన మల్లేష్.బ్యారక్ పూర్ కంటోన్మెంట్ మిలిటరీ యూనిట్ సమీపంలో చెరుకు రసం దుకాణదారుడైన బీర్బల్ షా అనే వ్యక్తితో మల్లేష్ కు ఏర్పడ్డ పరిచయం.బీర్బల్ షా కు స్నేహితుడైన అవల్ దెయ్ అలియాస్ ఓబీ అనే వ్యక్తి దేశంలో అక్రమంగా తయారు చేసిన తుపాకులను సేకరించి అమ్మే వ్యాపారం చేస్తాడని మల్లేష్ కు చెప్పిన బీర్బల్‌దీంతో గతంలో నేరచరిత్ర కలిగిన మల్లేష్ బ్యారక్ పూర్ ప్రాంతంలో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని డబ్బులు వసూలు చేసేందుకు పథకం రచించిన మల్లేష్.బీర్బల్ షా సమక్షంలో అవల్ దెయ్ అలియాస్ ఓబీ నుండి పదివేల రూపాయల నగదు చెల్లించి తపంచ కొనుగోలు చేసిన మల్లేష్.తాను కొనుగోలు చేసిన తపంచను వాడకుండానే స్వగ్రామంలో ఇంట్లో దాచిన విషయం విచారణలో తేలింది.

**ఆర్మీ ఆయుధాలు చోరీ చేసేందుకు కుట్ర**

తన గ్రామంలో ఉండే మల్లికార్జున్,నిరంజన్ అనే ఇద్దరు తన చిన్ననాటి స్నేహితులతో సన్నిహితంగా ఉండే మల్లేష్.జూన్ 2025 లో బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ 20 బెటాలియన్ లో చేరిన మల్లేష్.తన భార్య అనుషతో పాటు పిల్లలను తీసుకుని యాప్రాల్ లోని ఓ ఇంట్లో 12 వేల రూపాయలకు అద్దెకు దిగిన మల్లేష్. నాగర్ కర్నూల్ టౌన్ శ్రీపురం వద్ద 2022లో వారికి ఉన్న ఖాళీ స్థలంలో తన రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించిన మల్లేష్.అనంతరం నాగర్ కర్నూల్ ప్రాంతంలో 8 లక్షలు విలువచేసే ఓ ప్లాట్ ను కొనుగోలు చేసిన మల్లేష్.ఇంటి నిర్మాణంతోపాటు ప్లాటు కొనుగోలు చేయడంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ చాలగా ఆర్థిక ఇబ్బందులలో పడ్డ మల్లేష్.
ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడాలని భావించి తన చిన్ననాటి స్నేహితులైన నిరంజన్, మల్లికార్జున్ తో కలిసి ఆర్మీ ఆయుధాలు చోరీ చేసేందుకు బ్యాంకులలో, బంగారు దుకాణాలలో జరిగే చోరీలకు సంబంధించిన వీడియోలను వారికి పంపిన మల్లేష్. బ్యాంకు దోపిడీలు, దొంగతనాలు చేసే వీడియోలను వెబ్ సిరీస్ లు సామాజిక మాధ్యమాలలో చూసి వాటి ప్రేరణతో ఆర్మీ ఆయుధాలు దొంగలించే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడని సిపి పేర్కొన్నారు.2025 లోనే దొంగతనానికి ప్రణాళిక వేసినప్పటికీ అతని స్నేహితులు మల్లికార్జున్,నిరంజన్ ఆర్మీ ఆయుధాలను చోరీ చేసేందుకు ధైర్యం చేయలేకపోవడంతో తన వ్యూహాన్ని మార్చుకున్న మల్లేష్.సరికొత్త వ్యూహంతో ఆర్మీ ఆయుధాల చోరీకి రంగం సిద్ధం జూలై 2026 లో మద్రాస్ రెజిమెంట్ లోని 20 వ బెటాలియన్ లో పలుమార్లు రెక్కీ నిర్వహించిన మల్లేష్.మద్రాస్ రెజిమెంట్ లో పని చేస్తున్న తన సహచరుడైన శేషులుతో ఆర్మీ ఆయుధాల చోరీకి ప్రణాళిక వేసిన మల్లేష్ .ఆయుధాలు చోరీ చేసేందుకు తన బ్యాచ్ మేట్ అయిన ప్రవీణ్ సహకారం తీసుకున్న మల్లేష్.హెచ్ క్యూ కోట్ లో భద్రపరిచిన ఆయుధాలు మందు గుండు సామాగ్రిని దొంగిలించేందుకు తరచూ శేషులు ను సంప్రదించేవాడు మల్లేష్.శేషులు తనతో పాటు ఆయుధాగారం వద్ద విధుల్లో ఉండే వినోద్ ను చోరీ చేసే మల్లేష్ కు సహకరించాలని కోరడంతో అతను అందుకు అంగీకరించాడు.
ప్రణాళిక ప్రకారం చోరీ జరిగే వారం రోజుల ముందే సీసీ కెమెరాలు పనిచేయకుండా చేసిన శేషులు ,వినోద్. ఆయుధాగారం వద్ద చోరీ జరిగిన రోజు వినోద్ విధుల్లో ఉండడంతో మల్లేష్ కు చోరీ చేసేందుకు సులభతరమైంది.చోరీకి సహకరించినందుకు వినోద్ కు ఫుట్బాల్ గ్రౌండ్ వద్ద లక్ష రూపాయల నగదును అందజేసిన మల్లేష్.మొదటగా హోండా యాక్టివాలో ఆయుధాలను మందు గుండు సామాగ్రిని తరలించి అనంతరం బ్రీజా కారులో వాటిని తీసుకుని నాగర్ కర్నూల్ లోని తన ఇంట్లో దాచిన మల్లేష్.కలకత్తాలోని బీర్బల్ షా అనే వ్యక్తికి మల్లేష్ కు గతంలోనే పరిచయం ఉండడంతో తనకు ఆయుధాలు కావాలని మల్లేష్ ను సంప్రదించినట్లు విచారణలో వెల్లడించిన మల్లేష్.బీర్బల్ షా ద్వారా చోరీ చేసిన ఆయుధాలు అవల్ దెయ్ అలియాస్ ఓబీ కి సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న మల్లేష్.బీర్బల్ షాకు 5 లక్షలకు నాలుగు ఏకే 47 తుపాకులు..మూడు లక్షలకు పిస్టల్(షార్ట్ వెపన్స్) తుపాకులు కావాలని కోరిన బీర్బల్ షా.మద్రాస్ రెజిమెంట్ లోని 16వ బెటాలియన్ కు చెందిన ప్రవీణ్, 20వ బెటాలియన్ కు చెందిన శేషులు, వినోద్ ఆయుధాల చోరీ వ్యవహారంలో మల్లేష్ కు పూర్తి సహకారం అందించినట్లు పోలీసు విచారణలో తెలిపిన మల్లేష్.చోరీ చేసిన ఆయుధాలను కలకత్తాలోని బీర్బల్ షాకు పంపిన మల్లేష్.ఈ కేసులో బీర్బల్ షా,అవల్ దెయ్ అలియాస్ ఓబీ కోసం పోలీసులు పలు బృందాలుగా గాలింపు బీర్బల్ షా బంగ్లాదేశ్ నుండి కలకత్తాకు వచ్చే నివసిస్తున్నట్లు సమాచారంబీర్బల్ షాకు ఉగ్రవాద కార్యకలాపాలతో ఏవైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో మల్లేష్ నుండి సమాచారం సేకరించిన పోలీసులు.
దేశవ్యాప్తంగా బీర్బల్ షా, అవల్ దెయ్ అలియాస్ ఓబీ లకు అక్రమ ఆయుధాల నెట్వర్క్ ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.దొంగిలించిన ఆయుధాలలో వారికి విక్రయిందాం ఆలోచనలో బెడిసికొట్టింది.ఈ కేసులో కలకత్తాకు వెళ్లిన ఆరు ప్రత్యేక బృందాలు.బీర్బల్ షా,అవల్ దెయ్ అలియాస్ ఓబీ పోలీసులకు చిక్కితే కేసులో మరిన్ని కీలక అంశాలు తెలిసే అవకాశంఉందని పోలీసులు తెలిపారు.అలాగే ఈ కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందుతులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.
ఈ విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి జోన్ డిసిపి సిహెచ్: శ్రీధర్, అడిషనల్ డిసిపి,కార్ఖన ఏసిపి రమేష్, బొల్లారం ఇన్స్పెక్టర్ రాజు,డిఐ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు జగన్ వెన్నుపోటు

- **34 శాతం రిజర్వేషన్లపై దర్శి టీడీపీ బీసీ నేతల ధ్వజం**
- **'బీసీల రాజకీయ సాధికారత టీడీపీ డీఎన్ఏలోనే ఉంది'**
- **స్థానిక ఎన్నికల్లో కోటా పునరుద్ధరణకు న్యాయపోరాటం చేస్తాం**




దర్శి( ప్రశ్న న్యూస్) బీసీలకు రాజకీయంగా దక్కాల్సిన ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేందుకు వైఎస్సార్‌సీపీ కుట్రలు చేస్తోందని దర్శి నియోజకవర్గ టీడీపీ బీసీ నాయకులు ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు 105, 1065పై న్యాయస్థానంలో సవాళ్లు ఎదురైన నేపథ్యంలో.. బీసీల హక్కుల కోసం న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.శనివారం దర్శి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడారు. "బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడం టీడీపీ డీఎన్ఏలోనే ఉంది. బీసీలకు అన్యాయం చేసింది జగన్ ప్రభుత్వమే" అంటూ విమర్శలు గుప్పించారు.

## 34 శాతం కోసం కట్టుబడి ఉన్నాం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు టీడీపీ కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు.అయితే ఈ జీవోలను హైకోర్టులో సవాలు చేయడంతో వివాదం తలెత్తిందని చెప్పారు. అక్టోబరు 1న ఏపీ హైకోర్టు జీవో 105, జీవో 1065లను కొట్టివేసి, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటకుండా ఉండాలన్న అంశాన్ని ప్రస్తావించిందని పేర్కొన్నారు. అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల్లో ప్రారంభించాలని ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

## 'బీసీల నోటికాడ కూడు గుంజారు'

"34 శాతం నుంచి 24 శాతానికి తగ్గడం వల్ల వేలాది బీసీ రాజకీయ అవకాశాలు దెబ్బతిన్నాయి. గతంలో బీసీలకు అమలైన రిజర్వేషన్లను కొనసాగించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విఫలమైంది" అని టీడీపీ నేతలు ఆరోపించారు. అయితే రిజర్వేషన్లపై న్యాయపరమైన పరిణామాలు కేవలం రాజకీయ ఆరోపణలతో కాకుండా రాజ్యాంగ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాల్సిన అవసరం ఉందని హైకోర్టు తీర్పు స్పష్టం చేసిందన్నారు.బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వం సమకాలీన గణాంకాలను పరిగణనలోకి తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపిన విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు.

## కార్పొరేషన్లకు నిధులెక్కడ.?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి తగిన నిధులు కేటాయించలేదని టీడీపీ బీసీ నాయకులు విమర్శించారు. "పత్రికా ప్రకటనలకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారని చెబుతున్నా.. బీసీ కార్పొరేషన్ల ద్వారా ఒక్క బీసీ కుటుంబానికి స్వయం ఉపాధి కోసం ఎంత మేరకు సహాయం చేశారో చెప్పాలి" అని ప్రశ్నించారు.నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇచ్చామని చెప్పుకోవడం కంటే క్షేత్రస్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే ముఖ్యమన్నారు.సమావేశంలో దర్శి, దొనకొండ, కురిచేడు మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, పిడతల నెమిలయ్య, దర్శి ఏఎంసీ వైస్‌చైర్మన్ కోడిగ మస్తాన్‌రావు, దర్శి మండల బీసీ సెల్ అధ్యక్షుడు మేకనబోయిన సత్యనారాయణ, కౌన్సిలర్ రామ్‌గిరి, బత్తుల శ్రీనాథ్, బెల్లా శ్రీను, అంకాల వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి ఓఆర్‌ఆర్‌కు టెండర్లు

**- రూ.11,537 కోట్లతో పనులు**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మించ తలపెట్టిన అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఈ భారీ ప్రాజెక్టు పనుల కోసం నాలుగు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది. మొత్తం రూ.11,537.70 కోట్ల అంచనా వ్యయంతో సివిల్ పనులను చేపట్టనున్నారు. శుక్రవారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 195.13 కిలోమీటర్ల పొడవున ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందులో 189.93 కి.మీ. ఆరు వరుసల ఓఆర్ఆర్ కాగా, నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు 5.2 కి.మీ. నాలుగు వరుసల అనుసంధాన రహదారి కూడా ఉంది. నవంబర్ 18 వరకు బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించగా, 19న టెక్నికల్ బిడ్లను తెరవనున్నారు. కేంద్ర కమిటీల నుంచి తుది అనుమతులు త్వరలో రానున్నాయన్న అంచనాతో ఎన్‌హెచ్ఏఐ ముందుగానే టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టింది.ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్నారు. దీని ప్రకారం, నిర్మాణ సమయంలో కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థకు ప్రభుత్వం 40 శాతం నిధులు చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతం మొత్తాన్ని కాంట్రాక్టర్ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వం వడ్డీతో పాటు 10-15 ఏళ్లలో తిరిగి చెల్లిస్తుంది. ప్రతి ప్యాకేజీని మూడేళ్లలో పూర్తి చేయాలని టెండర్లలో పేర్కొన్నారు. ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 97 గ్రామాల మీదుగా ఈ ఓఆర్ఆర్ వెళ్తుంది. దీని నిర్మాణంలో భాగంగా కృష్ణా నదిపై రెండు భారీ వంతెనలు, మూడు సొరంగాలు, అనేక అండర్‌పాస్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాజధాని ప్రాంతంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ఓడరేవులు, విమానాశ్రయానికి అనుసంధానం మెరుగుపడి ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

# 'వరవు' మూవీ రివ్యూ!

మలయాళంలో జోజు జార్జ్ కి మంచి క్రేజ్ ఉంది. యాక్షన్ .. ఎమోషన్ తో కూడిన ఆయన సినిమాలను ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారు. అలాంటి ఆయన నుంచి ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన సినిమనే 'వరవు'. షాయాజీ కైలాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, జులై 16వ తేదీన అక్కడి థియేటర్లలో విడుదలైంది. అలాంటి ఈ సినిమా సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. రీసెంటుగా తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. పాల్సన్ (జోజు జార్జ్) సెంట్రల్ జైలు నుంచి 'పెరోల్'పై బయటికి వస్తాడు. కోర్టు అతనికి 10 రోజులు మాత్రమే సమయం ఇస్తుంది. ఈ లోగా తాను చేయవలసిన పనులు పూర్తి చేయాలనే కసితో అతను ఉంటాడు. అతని అక్కయ్య 'డైసీ' (సుకన్య) నన్ గా ఉంటుంది. తమ్ముడు 'విల్సన్' (అర్జున్ అశోకన్) కనిపించకుండాపోయి నాలుగేళ్లు అవుతూ ఉంటుంది. వాళ్లిద్దరి గురించి అతను ఎక్కువగా ఆలోచన చేస్తుంటాడు. అతనికి తోడుగా స్నేహితులైన సేతు – పాపన్ ఉంటారు. పాల్సన్ .. డైసీ .. విల్సన్ ఈ ముగ్గురూ కూడా తమ చిన్నతనంలోనే 'సెభాన్' (దీపక్ పరాంబోల్)ను చేరదీస్తారు. అయితే అతను రాజకీయంగా ఎదిగి ఇప్పుడు ఎమ్మెల్యే గా చక్రం తిప్పుతుంటాడు. ఆ ప్రాంతంలో అన్యాయాలకు .. అక్రమాలకు కేరాఫ్ అడ్రెస్ గా ఉన్న 'కొచ్చాటన్' చేతిలో పావుగా మారిపోతాడు. అక్కడి పోలీస్ స్టేషన్ లో ఉండే 'స్కారియా' కూడా 'కొచ్చాటన్' కోసమే తన అధికారాలను ఉపయోగిస్తూ ఉంటాడు. అతనికి అనుకూలంగా పనిచేస్తూ ఉంటాడు. 'కొచ్చాటన్' కూతురే 'లిషా'. పాల్సన్ తమ్ముడు విల్సన్ లెక్చరర్ గా పనిచేస్తున్న కాలేజ్ లోనే 'లిషా' చదువుకుంటూ ఉంటుంది. ఇద్దరూ ప్రేమించుకుంటూ ఉంటారు. ఆ ఊరు నుంచి పారిపోతారు. తన పరువు ప్రతిష్ఠలను బజార్లో పడేసిన విల్సన్ పై కొచ్చాటన్ మండిపడతాడు. వాళ్లిద్దరి ఆచూకీ తెలుసుకుని, తన కూతురును ఇంటికి తీసుకుని వెళతాడు. అప్పటి నుంచి విల్సన్ ఆచూకీ తెలియదు. తన తమ్ముడు కనిపించకుండా పోయిన విషయంలో కొచ్చాటన్ .. సెభాన్ .. స్కారియాపై పాల్సన్ కి అనుమానం ఉంటుంది.



పెరోల్ పై వచ్చిన ఆయన ఏం చేస్తాడు? ఎలా ప్రతీకారం తీర్చుకుంటాడు? అనేదే కథ. 'వరవు' అంటే మలయాళంలో 'రావడం' అనే అర్థం ఉంది. అంటే హీరో జైలు నుంచి 'పెరోల్' పై రావడం .. లేదంటే నాలుగేళ్ల క్రితం ఊరు నుంచి పారిపోయిన హీరో తమ్ముడు తిరిగి రావడం అనే సందర్భాలు మనకి ఈ కథకి తగినట్టుగా కనిపిస్తాయి. తన తమ్ముడికి జరిగిన అన్యాయానికి ఒక అన్నయ్య ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడనే దిశగా ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. అయితే ఈ ప్రతీకారం తీర్చుకునే విషయంలో ఒక కొత్త కోణం ఉంది. అయితే ఆ పాయింటు కూడా ఆల్రెడీ ఇంతకుముందు టచ్ చేసినదే. డబ్బు .. పలుకుబడి .. అధికారం .. ఈ మూడు ఏకమైతే, సామాన్యుల జీవితాలను బలి తీసుకునే ఆలోచనలు చేస్తాయి. ఈ మూడు శక్తులు ఏకమై నిలబడితే సామాన్యులు ఎదురువెళ్లలేరు .. ఏమీ చేయలేరు అనే ధీమా అరాచక శక్తులకు ఉంటుంది. అలాంటి వాళ్లకి ఒక సామాన్యుడి ప్రతీకారం ఎలా ఉంటుందనేది చూపించే కోణంలో దర్శకుడు ఈ కథను నడిపించాడు. ఈ కథ అంతా కూడా జోజు జార్జ్ చుట్టూనే తిరుగుతుంది. నెగెటివ్ షేడ్స్ కలిగిన మిగతా పాత్రలు తెరపై అక్కడక్కడా .. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ ఉంటాయి. ఒక బడా వ్యాపారీ .. ఒక రాజకీయనాయకుడు .. ఒక పోలీస్ ఆఫీసర్ ఈ కథలో విలన్స్ గా కనిపిస్తారు. అయితే మలయాళ సినిమాల సహజ లక్షణంగా .. వాస్తవానికి దగ్గరగా ఈ కథ కదులుతుంది. ఎక్కడా కూడా 'అతి' అనేది కనిపించదు. పరిస్థితులకు తగినట్టుగా మారిపోవడమే కనిపిస్తుంది. ఈ కథలో హీరో తమ్ముడి ప్రేమవ్యవహారం చాలా కీలకం. కథను మలుపు తిప్పే అంశం ఇదే. అలాంటి ఈ అంశానికి పెద్దగా ప్రాముఖ్యతను ఇవ్వకపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. కథ .. కథనం .. చిత్రీకరణ .. ఇవన్నీ కూడా బోర్ అనిపించకుండా సాగిపోతూనే ఉంటాయి. కాకపోతే గతంలో వచ్చిన ఈ తరహా కథల అడుగుజాడలలోనే ఈ కథ కూడా నడవడం ఇబ్బందిని కలిగిస్తుంది. జోజు జార్జ్ నటన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఆయన తరువాత ప్రభావితం చేసే స్థాయిలో మిగతా పాత్రలేవీ కనిపించవు. శరవణన్ ఫొటోగ్రఫీ .. సామ్ సీఎస్ నేపథ్య సంగీతం .. ఆకట్టుకుంటాయి.

షమీర్ మహ్మద్ ఎడిటింగ్ ఫరవాలేదు. కర్మ ఫలితం ఎవరినీ వదిలిపెట్టదు. నువ్వు మంచి చేసినా .. చెడు చేసినా దాని ఫలితాన్ని ముట్టజెప్పడానికి అది నిన్ను వెంటాడుతూనే ఉంటుంది అనే సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది.

# 22 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలోకి..

## 'ఆరుగురు పతివ్రతలు' రీ-రిలీజ్!



దివంగత దర్శకుడు ఈ.వి.వి. సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం "ఆరుగురు పతివ్రతలు". అప్పట్లో వివాహ వ్యవస్థ, దాంపత్య జీవితంలోని సంక్లిష్టతలు, ఈగోలు మరియు కుటుంబ బంధాల నేపథ్యంలో సాగిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఓ సరికొత్త సంచలనం సృష్టించింది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఆలోచింపజేసిన ఈ చిత్రం, ఇప్పుడు సరికొత్త హంగులతో మరోసారి థియేటర్లలో అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమాను అక్టోబర్ 29న అత్యంత వైభవంగా గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో పాత క్లాసిక్ సినిమాలను 4ఖ మరియు మెరుగైన సాంకేతిక హంగులతో రీ-రిలీజ్ చేసే ట్రెండ్ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వస్తున్న ఈ కల్ట్ ఫ్యామిలీ అండ్ బోల్డ్ ఎంటర్‌టైనర్ యూత్ ని, ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఒకేలా ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రం తొలిసారిగా 2004 ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సాధించింది. సరిగ్గా ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు సరికొత్త డిజిటల్ టెక్నాలజీతో నేటి తరానికి సరికొత్త వినోదాన్ని పంచేందుకు రీ-ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమా ప్రత్యేకత ఏమిటంటే, దర్శకుడు ఈవీవీ ఈ చిత్రం ద్వారా దాదాపు 42 మంది కొత్త నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేశారు. వారితో పాటు ప్రముఖ నటులు ఎల్.బి. శ్రీరామ్, చలపతిరావు తదితరులు కీలక పాత్రల్లో నటించి తమ నటనతో అలరించారు. మరి ఇన్నేళ్ల తర్వాత థియేటర్లలో రీ-ఎంట్రీ ఇస్తున్న ఈ కల్ట్ కామెడీ-డ్రామా మూవీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సందడి సృష్టిస్తుందో వేచి చూడాల్సిందే!

### కొత్త లగ్జరీ విల్లా కొనుగోలు చేసిన

# విజయ్--రష్మిక జంట

## రూ.21 కోట్ల వరకు ఉంటుందంటూ ప్రచారం

టాలీవుడ్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమాలతో పాటు వీరి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు కూడా తరచూ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారుతుంటాయి. తాజాగా ఈ జంటకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త నెట్టింట్లో వైరల్ అవుతోంది. హైదరాబాద్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి ఓ ఖరీదైన లగ్జరీ విల్లాను కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని అల్మాస్‌గూడ--తుక్కుగూడ ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్న ఓ ప్రీమియం విల్లా ప్రాజెక్టులో విజయ్, రష్మిక ప్రాపర్టీ కొనుగోలు చేసినట్లు రియల్ ఎస్టేట్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాంతంలో భారీ విస్తీర్ణంలో విల్లాలు, అత్యాధునిక సదుపాయాలతో కూడిన ప్రీమియం నివాస ప్రాజెక్టులు అభివృద్ధి అవుతున్నట్లు సమాచారం. విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో పాటు విల్లా ప్రాజెక్టుల్లో ప్రత్యేకమైన సదుపాయాలు ఉండటం వల్ల ఈ ప్రాంతానికి డిమాండ్ పెరుగుతోందనే చర్చ కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే విజయ్--రష్మిక పేర్లు ఈ ప్రాజెక్టుతో ముడిపడి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, విజయ్--రష్మికకు సంబంధించినదిగా చెబుతున్న విల్లా విలువ సుమారు రూ.12 కోట్ల నుంచి రూ.21 కోట్ల మధ్య ఉండవచ్చని టాక్. అయితే ఇది కేవలం ప్రచారంలో ఉన్న అంచనా మాత్రమే. వీరిద్దరూ నిజంగా విల్లాను కొనుగోలు చేశారా? కొనుగోలు చేసి ఉంటే దాని అసలు ధర ఎంత? అనే విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం లేదు. అంతేకాకుండా, ఈ విల్లాను తమ అభిరుచికి అనుగుణంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దుకుంటున్నారనే ప్రచారం కూడా సోషల్ మీడియాలో కనిపిస్తోంది. కానీ దీనిపై కూడా విజయ్ దేవరకొండ లేదా రష్మిక మందన్న ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.విల్లా కొనుగోలు వార్తతో పాటు మరో చర్చ కూడా మొదలైంది. విజయ్, రష్మిక తమ కుటుంబాలకు దూరంగా కొత్త ఇంట్లో కలిసి ఉండబోతున్నారా? అంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అయితే కేవలం ఓ ప్రాపర్టీ కొనుగోలు చేశారనే ప్రచారం ఆధారంగా వారు వేరు కాపురం పెట్టబోతున్నారని చెప్పడం సాధ్యం కాదు. పెట్టుబడి కోసం, భవిష్యత్ అవసరాల కోసం, వ్యక్తిగత సమయం గడపడానికి లేదా కుటుంబ అవసరాల కోసం కూడా సెలబ్రిటీలు ఖరీదైన ప్రాపర్టీలను కొనుగోలు చేస్తుంటారు. కాబట్టి ఈ విల్లా కొనుగోలు వార్తకు, వారి వ్యక్తిగత జీవితానికి మధ్య సంబంధాన్ని ఇప్పుడే నిర్ధారించడం తొందరపాటే.

### నటిగా మారడం వెనుక

## అసలు కథ ఇదే..

**- శ్రుతిహాసన్ ఆసక్తికర విషయాలు**



సినీరంగంలోకి రాకముందు రచయితగా రాణించాలనే కోరిక బలంగా ఉండేదని, అనుకోని పరిస్థితుల వల్ల నటిగా మారాల్సి వచ్చిందని అగ్ర కథానాయిక శృతిహాసన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. కోచిలో జరుగతున్న ఇండియా టుడే సౌత్ 2026 సదస్సులో మాట్లాడిన ఆమె కెరీర్ తాలూకు పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. అద్భుతమైన సినీ వారసత్వం ఉన్న కుటుంబంలో పుట్టినప్పటికీ నటన తన తొలి ఛాయిస్ కాదని శృతిహాసన్ పేర్కొన్నది. "హే రామ్' సినిమాలో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ కుమార్తె పాత్ర కోసం ఓ ఆర్టిస్టు కావాల్సి వచ్చింది. ఆ సమయంలో నేను సినిమా కాస్ట్యూమ్ విభాగంలో పనిచేస్తున్నా. నాన్న అభ్యర్థన మేరకు ఆ పాత్రకు ఒప్పుకున్నా. అలా నా సినీ ప్రయాణం మొదలైంది. 2009లో 'లక్' సినిమాలో నటించి ఇండస్ట్రీ నుంచి తప్పుకుందామనుకున్నా. ఆ సినిమా ద్వారా వచ్చిన డబ్బుతో మ్యూజికల్ డ్రమ్‌కిట్, మిక్సర్ కన్సోల్ కొనుగోలు చేశా. ఇక సంగీతంపైనే పూర్తిగా దృష్టి పెడదామనుకున్నా. కానీ విధి మరోలా తలచింది. 'లక్' సినిమాలో నటన నాకే నచ్చలేదు. దాంతో నేనెంటో నిరూపించుకోవాలనే లక్ష్యంతో యాక్టింగ్‌ను సీరియస్‌గా తీసుకున్నా' అని శృతిహాసన్ చెప్పింది.

# నా సినిమాలు చూసి నేనే గర్వపడాలి

'సాఫ్ట్‌వేర్ జాబ్ చేసి, నటనపై ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. ఇష్టంతో ఓ రంగాన్ని ఎంచుకున్నప్పుడు కష్టమైనా భరిచాలి. సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి' అన్నారు కన్నడ కస్తూరి శ్రీనిధి శెట్టి. ఈ అందాలభామ వెంకటేశ్‌కి జోడీగా నటించిన 'ఆదర్శకుంటుంబం' సినిమా ఈ నెల 9న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను శ్రీనిధి వెల్లడించారు. "ఆదర్శకుటుంబం'లో నేను పోషించిన తల్లి పాత్ర నా కెరీర్‌పై చెడు ప్రభావం చూపిస్తుందని చాలామంది అనుకుంటున్నారు.నేనైతే అలా అనుకోను. 'ఆదర్శకుటుంబం' చూశాక ఆ పాత్ర నేనెందుకు ఒప్పుకున్నానో అందరికీ అర్థమవుతుంది. 15ఏండ్ల తర్వాత నేను నటించిన సినిమాలు చూసి, నేనే గర్వపడాలి' అని చెప్పారు శ్రీనిధి. ఇంకా చెబుతూ 'ఈ సినిమా పుణ్యమా అని వెంకటేశ్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆయన్నే ప్రేరణగా తీసుకొని ఈ సినిమాలోని నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. వెంకటేష్ లొకేషన్‌లో చాలా సరదాగా ఉంటారు. ఆయనతో పనిచేసే అవకాశం రావడం నిజంగా అదృష్టం' అని ఆనందం వెలిబుచ్చారు శ్రీనిధిశెట్టి.



# విజయ్ తనయుడి 'సిగ్మా'..

## - సోషల్ మీడియా టాక్ ఇదే!




తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన చిత్రం 'సిగ్మా'. సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రం శుక్రవారం (అక్టోబరు 2) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలిరోజు సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి సోషల్ మీడియాలో మంచి స్పందన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా చిత్రంలోని ట్విస్టులు, యాక్షన్ సన్నివేశాలు, నేపథ్య సంగీతం అద్భుతంగా ఉన్నాయని పలువురు ప్రశంసిస్తున్నారు. ఒక పురాతన నిధి అన్వేషణ (ట్రెజర్ హంటర్) కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. సినిమా పూర్తిగా కథానుగుణంగా సాగుతుందని, ఇంటర్వెల్ యాక్షన్ బ్లాక్, తమన్ అందించిన సంగీతం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయని వీక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'తొలి సినిమా అయినప్పటికీ జాసన్ దర్శకత్వంలో మంచి పరిణితి కనిపించిందని', 'ఇది పక్కా మాస్ ఫీస్ట్', 'సందీప్ కిషన్ నటన, స్క్రీన్ ప్రెజెన్స్ అదరగొట్టారని' నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. అయితే, ఈ సానుకూల ఫీడ్‌బ్యాక్‌తో పాటు అక్కడక్కడా మిశ్రమ స్పందన కూడా వ్యక్తమవుతోంది. ప్రథమార్ధం కొంత రొటీన్‌గా ఉందని, కథనంలో ఆశించినంత కొత్తదనం లేదని కొందరు విమర్శిస్తున్నారు. సినీ విమర్శకుల నుంచి కూడా ఈ చిత్రంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నైలోని ఒక థియేటర్‌లో జాసన్ తల్లి సంగీత, సోదరి దివ్య ఈ సినిమాను వీక్షించారు. జాసన్ సంజయ్ సైతం స్వయంగా ప్రేక్షకులతో కలిసి మొదటి రోజు సినిమాను చూశారు. ఈ చిత్రానికి కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించారు.

# తెలుగులో

# 'హనుమాన్ అంశ్'

చిన్న సినిమాగా విడుదలై దేశమంతా నివ్వెరపోయే విజయాన్ని సాధించిన సినిమా 'హనుమాన్ అంశ్'. నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రాన్ని రెండు కోట్లతో నిర్మించగా, ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా 360 కోట్లు రాబట్టింది. నిర్మాతకు అనూహ్య లాభాలు తెచ్చిపెట్టిన విషయంలో దంగల్, దురంధర్-2 సినిమాలను సైతం ఈ సినిమా దాటిపోయిందని చెప్పక తప్పదు. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమాలో షోబినా సత్య ప్రధాన పాత్ర పోషించిన విషయం తెలిసిందే. టాలీవుడ్ అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేసేందుకు సిద్ధమైనట్టుగా గతంలో వార్తలొచ్చాయి. అయితే.. తాజాగా కన్నడ అగ్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 9న 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్ విడుదల కానున్నది. ఈ సినిమా తెలుగు రిలీజ్ కోసం ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు ఇది నిజంగా శుభవార్తే.



## వృద్ధుడికి అమ్మ ఆసరా ఫౌండేషన్ ఆశ్రయం లో చేర్పించిన నాచారం పోలీసులు



నాచారం (ప్రశ్న న్యూస్) నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్, ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో సుమారు 85 సంవత్సరాల వయస్సు గల నాగప్ప, తండ్రి నర్సప్ప అనే వృద్ధుడు ఒంటరిగా తిరుగుతూ పోలీసుల దృష్టికి వచ్చారు. వృద్ధుడి వయస్సు, పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నాచారం పోలీసులు అతని భద్రత, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో ఏఎస్ఐ నర్సింహారెడ్డి, కానిస్టేబుల్ రంజిత్ కుమార్ వృద్ధుడిని అమ్మ ఆసరా ఫౌండేషన్, బోడుప్పల్, చెంగిచెర్ల రోడ్ వద్దకు తీసుకెళ్లి, అక్కడి నిర్వాహకులకు అప్పగించారు. ఫౌండేషన్ వారు వృద్ధుడికి ఆశ్రయం, ఆహారం, సంరక్షణ అవసరమైన సహాయం అందించేందుకు అంగీకరించారు.వృద్ధుడి భద్రత మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నాచారం పోలీసుల చొరవతో ఆయనకు సురక్షితమైన ఆశ్రయం కల్పించబడింది.

# నర్సాపూర్ లో కాంగ్రెస్, బీజేపీలకు షాక్

### - బీఆర్ఎస్ లో చేరికలు - కాంగ్రెస్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అధికార కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కీలక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు, స్థానిక ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి సమక్షంలో వారు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారికి హరీశ్ రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఆ పార్టీ ఖాళీ అవుతుండటం వారి వైఫల్యాలకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు.

#### రోడ్లు పట్టించుకోరు.. ఫ్యూచర్ సిటీపై ప్రేమ

కాగజ్ మద్దూర్ పరిధిలోని రోడ్లు మోకాలి లోతు గుంతలుగా మారి గర్భిణీలు, రోగులు ఆసుపత్రులకు వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తిరిగే రోడ్లకు గుంతలు పూడ్చడానికి నిధులు లేవంటున్న ప్రభుత్వం, జనావాసాలు లేని ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం రూ. 10 వేల కోట్లతో ఆరు వరుసల రోడ్లు నిర్మించడం వెనుక అంతరార్థమేమిటని ప్రశ్నించారు.

#### అమలుకాని గ్యారెంటీలు - రైతులకు తీరని అన్యాయం

ఎన్నికల ముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు ఇస్తామని బాండ్ పేపర్లు రాసిచ్చిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడా హామీలను బొందపెట్టారని మండిపడ్డారు. రూ. 4 వేల పెన్షన్ ఆశ చూపి అవ్వలను మోసం చేశారని, గత 34 నెలల లెక్కన ఒక్కో అవ్వకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 68 వేలు బాకీ పడిందని తెలిపారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.

#### కరెంటు కోతలు - కాంగ్రెస్ తెచ్చిన కృత్రిమ కరువు

రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ లభించగా, నేడు కనీసం 6, 7 గంటలు కూడా సరిగ్గా రావడం లేదని, సబ్‌స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు చేసే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో బొగ్గు నిర్వహణ లోపం వల్ల దాదాపు 2,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని, కరెంటు కోతలకు ఎల్ నినో కారణమని చెబుతూ ప్రభుత్వం కుంటిసాకులు వెతుకుతోందని అన్నారు. సింగరేణి థర్మల్ ప్లాంట్ విద్యుత్‌ను రాజస్థాన్‌కు విక్రయించే ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

#### కాళేశ్వరం నీళ్లను ఎందుకు వదలడం లేదు?

ఎన్డీఎస్ఏ నివేదికల ప్రకారం అన్నారం, సుందిల్ల బ్యారేజీలు సురక్షితంగా ఉన్నాయని, నీటిని వాడుకోవచ్చని హైకోర్టు తెలిపినా కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయడం లేదని పేర్కొన్నారు. కాళేశ్వరం నీళ్లు ఇస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అసూయతోనే ప్రభుత్వం నీటిని పారించకుండా పంటలను ఎండబెడుతోందని ఆరోపించారు.నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం ఐయోడిన్, టీటీ ఇంజెక్షన్లు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను నిలిపివేసి పేదలకు వైద్యం దూరం చేశారని తెలిపారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమూల్ ప్రారంభోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### బ్రాహ్మణపల్లిలో ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా బ్రాహ్మణపల్లిలో అమూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు బ్రాహ్మణపల్లిలోని కార్యక్రమ ప్రాంగణాన్ని పరిశీలించారు.కార్యక్రమానికి వచ్చే ప్రముఖుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, బందోబస్తు విధులు తదితర ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులతో సమీక్షించారు.వీఐపీల రాక సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. బందోబస్తులో విధులు నిర్వహించే సిబ్బందికి తమకు కేటాయించిన ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉండాలని ఆదేశించారు.జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు హాజరయ్యే నేపథ్యంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ , డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా రాజేశ్వర్ రెడ్డి



జనగామ(ప్రశ్న న్యూస్) జనగామ జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధిగా తౌటి రెడ్డి రాజేశ్వర్ రెడ్డిని నియమిస్తూ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు అల్లబోయిన హరీష్ నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అందించినట్టి గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. బిజెపి సంస్థగత నిర్మాణంలో తన వంతు పాత్రను సహాయ శక్తుల నిర్వర్తిస్తానన్నారు. తన దృష్టికి వచ్చిన ఎలాంటి సమస్య పైన అయినా తప్పకుండా స్పందిస్తూ పార్టీ బలోపేతనికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన జనగామ జిల్లా బిజెపి అధ్యక్షులు సౌడ రమేష్, రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధి సంతోష్ యాదవ్, బొజ్జపల్లి సుభాష్, రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ దాస్యం అభినవ్ భాస్కర్, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, స్టేషన్ ఘన్పూర్ మండల అధ్యక్షులు వెంకటరమణ గౌడ్, గాజుల సంపత్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తా

### తెలంగాణ రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కొండం ఆంజనేయులు ముదిరాజ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులుగా కొండం ఆంజనేయులు ముదిరాజ్ నియమితులయ్యారు. రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య విడుదల చేసిన నియామక పత్రాన్ని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్ రెడ్డి శనివారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఆంజనేయులు ముదిరాజ్ నియామక పత్రాన్ని స్వీకరించారు.గ్రామస్థాయి నుంచి పార్టీ ప్రస్థానాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర స్థాయి బాధ్యతలను చేపట్టడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం, యువ మోర్చా మండల కార్యదర్శి, జిల్లా కార్యదర్శి బాధ్యతల మీదుగా 2020 నుంచి 2024 వరకు మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా కొనసాగింది. ఈ క్రమంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు.ముఖ్యంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేశారు. కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువస్తూ, మేడ్చల్ ప్రాంతంలో బీజేపీకి గణనీయమైన ప్రజా మద్దతు, ఓటు బ్యాంకు సాధించడంలో క్రియాశీల పాత్ర పోషించారు.ప్రస్తుత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గిర్మాపూర్ ప్రాంతంలో రైతు సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి విశేషంగా కృషి చేశారు. మెజారిటీ వార్డు సభ్యుల ఎన్నిక, ఉప సర్పంచ్ విజయం, కౌన్సిలర్ ఎన్నికల్లో పార్టీ తరఫున సమన్వయం, ప్రచారం నిర్వహిస్తూ తన రాజకీయ చొరవను చాటుకున్నారు. మేడ్చల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీకి అంకితభావంతో సేవలందించారు.తనపై నమ్మకంతో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నర్సయ్యకు, తన రాజకీయ ప్రస్థానంలో ప్రోత్సాహం అందిస్తూ సహకరించిన బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్ రెడ్డికి కొండం ఆంజనేయులు ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అప్పగించిన ఈ బాధ్యతను పదవిగా కాకుండా రైతాంగానికి సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం పార్టీ వేదికగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తానని తెలిపారు.రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను మరింత చేరువ చేయడంతో పాటు, రైతాంగ హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై నిరంతరం అందుబాటులో ఉంటూ, రైతాంగాన్ని సంఘటితం చేసి బీజేపీ కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆంజనేయులు ముదిరాజ్ వెల్లడించారు.గ్రామస్థాయి కార్యకర్తగా ప్రారంభమైన తన ప్రయాణానికి రాష్ట్ర స్థాయి బాధ్యత రూపంలో గుర్తింపు లభించడం కార్యకర్తల కష్టానికి, అంకితభావానికి దక్కిన గౌరవంగా ఆయన అభివర్ణించారు.

## మేడ్చల్ ఆర్టీసీ డిపోలో కాంగ్రెస్ జోరుగా ప్రచారం

### ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో టి డబ్ల్యు యు అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ నాయకుల ప్రచారం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఆర్టీసీ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారం మేడ్చల్ ఆర్టీసీ డిపోలో జోరుగా సాగింది.ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో డిపో గౌరవ అధ్యక్షులు సాటే నరేందర్ వంజరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు డిపోలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులను కలిసి ఎన్నికలపై నాయకులు మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టియుసి, ఎస్ డబ్ల్యు యు టీఎంయూ ఎస్ డబ్ల్యు ఎఫ్ మద్దతు ప్రకటించిన టి డబ్ల్యు యు అభ్యర్థులకు కార్మికులు మద్దతు ఇవ్వాలని,బాణం గుర్తుపై తమ ఓటు వేయాలని నాయకులు కోరారు.కార్మికుల సంక్షేమం,వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం,గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని,కార్మికుల హక్కులు మరియు సంక్షేమం కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని,వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, మేడ్చల్ ఆర్టీసీ డిపో అధ్యక్షులు సాటే నరేందర్ వంజరి పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అమీర్ ఆలీ,సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, మేడ్చల్ ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షులుసాటే నరేందర్ వంజరి, మేడ్చల్ మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ, జాకట దేవరాజ్, కౌడే మహేష్ కురుమ, పాలకుర్తి రాఘవేందర్ గౌడ్ ,నారెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నడికొప్పు రంజిత్ ముదిరాజ్, వేముల శ్రీనివాస్ రెడ్డి, గువ్వ రవి ముదిరాజ్, ఉదండపురం సత్యనారాయణ, సల్ల వెంకటేష్ యాదవ్, రామన్నగారి సంతోష్ గౌడ్, లవంగు రాకేష్ వంజరి, ఆర్టీసీ యూనియన్ నాయకులు శేఖర్, శివ, జ్నానేశ్వర్, మధు, ఆనంద్, రాజు, రాజేష్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ యూనియన్ ప్రతినిధులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కండ్ల కొయ్య లో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### పంపిణీ చేసిన గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు. గరిసెలసురేందర్ ముదిరాజ్



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోనికండ్లకోయలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసారాధ్యంలోప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం స్మార్ట్ రేషన్ కార్డుల పథకం అని పేర్కొన్నారు..పౌర సరఫరాల శాఖ అధికారి లక్ష్మీకాంత్ రేషన్ డీలర్ లావణ్య ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు బొక్క శ్రీకాంత్ రెడ్డిలికక్రోలా సంతోష్ లసమక్షంలో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ గుండ్ల పోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్, కండ్ల కొయ్య మాజీ సర్పంచులు కందాడి నరేందర్ రెడ్డి, కక్రోల్ల స్వామి మేడ్చల్ ఓబీసీసెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్, మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గోమారం రమణారెడ్డి , మేడ్చల్ సొసైటీ మాజీ డైరెక్టర్ దామనగారి నరహరి, కండ్ల కొయ్య మాజీ ఉపసర్పంచ్ చిల్ల వెంకటేష్ ముదిరాజు , రాజేందర్ ముదిరాజు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాకార బోయిన మల్లేష్ ముదిరాజ్ , వీరస్వామి , వెంకట్ ముదిరాజ్ , బొక్క కృష్ణారెడ్డి, కందాడి సందీప్ రెడ్డి , గుండ్ల పోచంపల్లి డివిజన్ సేవాదళ్ అధ్యక్షులు చిల్ల సాయి ముదిరాజ్ శ్రీనివాస్ , శివ ముదిరాజ, శ్రీకాంత్ ముదిరాజు పాల్గొని లబ్ధిదారులకు అధికారుల్లో కలిసి స్మార్ట్ రేషన్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## హెచ్చరిక బోర్డుల్లేవు.. వాహనదారులకు తిప్పలే

### - కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వస్తున్న వాహనదారులు..

### - సొంత ఖర్చుతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్త రవీందర్ ముదిరాజ్




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా.. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరారం ఎక్స్‌రోడ్ నుంచి బౌరంపేట్, శంబిపూర్ , ఐడీఏ బొల్లారం, మియాపూర్ వైపు వెళ్లే మార్గంలో సూరారం గ్రామం విశ్వకర్మ కాలనీ ప్రాంతం దాటిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. కాగా పనులు జరుగుతున్న విషయాన్ని ముందుగానే తెలియజేసే సూచికలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలు సైతం సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.వాహనదారుల ఇబ్బందులను గమనించిన మాజీ లారీ యజమాని, నార్త్ రన్ సిటీ ఇసుక లారీల సంఘం మాజీ కార్యదర్శి, సామాజిక-- పర్యావరణ కార్యకర్త రవీందర్ ముదిరాజ్ స్పందించారు. అధికారుల కోసం ఎదురుచూడకుండా తన సొంత ఖర్చుతో మూడు సూచిక బ్యానర్లు ఏర్పాటు చేసి వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించారు. సూరారం చౌరస్తా నుంచి కట్టమైసమ్మ ఆలయం-బహాదూర్పల్లి ఎక్స్‌రోడ్ చౌరస్తా వరకు వెళ్లి ఎడమవైపు తిరిగి బౌరంపేట్, ఐడీఏ బొల్లారం, బాచుపల్లి వైపు వెళ్లాలని వాహనదారులకు సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, బాబు, నవీన్‌కుమార్,కార్తీక్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తాము ఇబ్బంది పడుతున్నా ప్రజల భద్రత కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంపై స్థానికులు, వాహనదారులు రవీందర్ ముదిరాజ్‌ను అభినందించారు. ఇలాంటి బాధ్యతాయుతమైన వ్యక్తులు ఉన్నంతకాలం ప్రజా ప్రయోజనం, న్యాయం బతికే ఉంటాయి అంటూ ఆయన సేవలను కొనియాడారు.

# ఎక్స్‌పైరీ తేదీ లేని కల్తీ మిఠాయిలు, రసగుల్ల ప్యాకెట్లు

## -సోయిలేని ఫుడ్ సేఫ్టీ అధికారులు

- అపరిశుభ్రం వాతావరణంలో చిరుతిళ్ల తయారీ
-కల్తీ పదార్థాల వినియోగంతో మిఠాయిల తయారీ
-మరిగించిన వంటనూనెను మళ్ళీ మళ్లీ వాడటంతో అనారోగ్య సమస్యలు
-అనుమతి లేని చాక్లెట్స్ రసగుల్ల మిఠాయిల ప్యాక్టరీలపై చర్యలేవి.?
-అధికారుల అవినీతి కారణంగా అక్రమార్కులకు కాసుల పంట
-ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మిర్చి బజ్జీ బండ్లపై కల్తీ పదార్థాల బెడద






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసిన చాక్లెట్లు, మిఠాయిలు, రసగుల్లాల వంటి వాటి వల్ల పిల్లలో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమై ప్రాణాంతకంగా మారుతుంది. మార్కెట్లోని షాపుల్లో లభించే కొన్ని మిఠాయిలు, స్వీట్లు, చాక్లెట్ల ప్యాకింగ్‌తో పాటు సరైన పద్ధతిలో నిల్వ చేయకపోవడం, నాణ్యత లేని పాలు, ఇతర కల్తీ వస్తువులను వాడటం, తయారీ కేంద్రాలలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించక పోవడం, ప్రమాదకర రసాయనాల వాడకంతో బూజుపట్టి బాక్టీరియా చేరే ప్రమాదం పొంచి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సరైన పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా తయారుచేసిన చాక్లెట్లు, రసగుల్ల, మిఠాయిలు తినడంతో ప్రమాదకరమైన ఈ-కోలై, సాల్మోనెల్లా వంటి బ్యాక్టీరియా చేరి ఫుడ్ పాయిజన్‌కు దారితీస్తాయి. దీంతో కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో ఇబ్బందులకు గురయే ప్రమాదం ఉంది. అలాగే వీటి తయారీలో పరిశుభ్రమైన నీటిని ఉపయోగించక పోవడం వల్ల టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేసిన వీటిని ఎక్కువ రోజులు పాడవకుండా ఉండటానికి హానికరమైన రసాయనాలు, ప్రిజర్వేటివ్స్ ను వాడటంతో ఇవి శరీరానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### కొనేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు..

సాధారణంగా షాపుల్లో అందుబాటులో ఉన్న చాక్లెట్లు, మిఠాయిలు, రసగుల్లా ప్యాకెట్లను కొనే ముందు అది ఎప్పుడు తయారైంది, ఎప్పటి వరకు వాడుకోవచ్చనే వివరాలతో పాటు ప్యాకెట్ ఎక్కడైనా చిరిగిందా, ఎయిర్ లీక్ అవుతుందా లేదా ప్యాకేజీ ఉబ్బిపోయి ఉందా అనే వివరాలను తప్పనిసరిగా గమనించాలి. ప్యాకేజీ ఉబ్బి ఉంటే అందులో గ్యాస్ ఫామ్ అయి, స్వీట్ పాడైపోయిందని అర్థం. అలాగే ప్యాకెట్‌పై భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ గుర్తింపు ముద్ర ఉందో లేదో సరిచూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏది ఏమైనా నాణ్యమైన, నమ్మకమైన బ్రాండ్ల ఉత్పత్తులనే ఎంచుకోవడం ఆరోగ్యపరంగా ఉత్తమం.

### రంగు, వాసన గమనించాలి..

ప్యాకెట్ విప్పిన తర్వాత మిఠాయిలు, రసగుల్లాలు రంగుమారి నల్లగా ఉన్నా, పుల్లటి వాసన వస్తున్నా, లేదా వాటిపై రంధ్రాలు ఏర్పడిన వాటిని తినడం ప్రమాదకరం.

### అనుమతులు లేని ఫ్యాక్టరీలపై చర్యలేవి..

అనుమతులు లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో తయారుచేస్తున్న మిఠాయిలు, చాక్లెట్లు, రసగుల్ల వంటి తినుబండారాల తయారీదారులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కల్తీ పదార్థాలు, రసాయనాలతో కూడిన తినుబండారాల తయారీదారుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కిరాణషాపుల్లో విక్రయిస్తున్న చాక్లెట్లు, రసగుల్ల, మిఠాయిల ప్యాకెట్లపై కేవలం తయారీదారులు చిరునామా, బరువు, ధరను మాత్రమే ముద్రించి ఎక్స్‌పైరీ తేదిని ముద్రించకపోవడం గమనార్హం. ఇలాంటి తినుబండారాలకు ఆకర్షితులయ్యే పిల్లలు వాటిని తిని అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్యాకెట్లలో పదార్థాలు బూజు పట్టి రంధ్రలు ఏర్పడినను వాటిని కిరాణ దుకాణాల్లో యదేచ్ఛగ విక్రయిస్తున్నా ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి ఎందుకు అందడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### జాడే లేని ఫుడ్ సేఫ్టీ అధికారులు..

విచ్చలవిడిగా కల్తీ భాగోతం నడుస్తున్న పర్యవేక్షించే ఫుడ్ సేఫ్టీ అధికారుల జాడేలేదని ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలాపూర్ బడంగ్ పేట్, మీర్‌పేట్, నాధర్‌గుల్, అదిబట్ల తదితర ప్రాంతాల్లో అత్యంత దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మిర్చి బజ్జీ వ్యాపారులు కల్తీ వస్తువులను వాడటమే కాకుండా అపరిశుభ్ర పరిసరాల్లో, మరిగించిన వంట నూనెలను మళ్ళీ మళ్ళీ వాడుతు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కిరాణ దుకాణాలు, రోడ్లపై నిర్వహిస్తున్న బండ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అపరిశుభ్ర పరిసరాల్లో తయారుచేస్తున్న ఆహర పదార్థాలు, ఎక్స్‌పైరీ డేట్ వివరాలు లేకుండా విక్రయిస్తున్న చాక్లెట్లు, రసగుల్ల, మిఠాయిల ప్యాకెట్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇంద్రకీలాద్రిపై రేపు వీఐపీ దర్శనాలు బంద్

## ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 వరకు నిలిపివేత



విజయవాడ(ప్రశ్న న్యూస్) వరుస సెలవులు, భక్తుల రద్దీ దృష్ట్యా ఇంద్రకీలాద్రిపై ఆదివారం ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలను పూర్తిగా నిలిపివేయనున్నారు. అక్టోబరు 4న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తున్నట్లు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో వి.కె. శీనానాయక్ తెలిపారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో రద్దీ నెలకొంది. దీనికితోడు ఘాట్‌రోడ్డు మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### కనకదుర్గనగర్ వైపు రాకపోకల నియంత్రణ

రద్దీని నియంత్రించేందుకు ఆదివారం కనకదుర్గనగర్ వైపు వాహనాల రాకపోకలను నియంత్రించనున్నట్లు ఈవో తెలిపారు. బ్యాటరీ వాహనాలను వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లుల సౌకర్యార్థం మాత్రమే వినియోగించనున్నారు. లిఫ్ట్ మార్గాన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. భక్తులు మహామండపం ర్యాంప్ మీదుగా కొండపైకి చేరుకోవాలని సూచించారు.

### ఉదయం 8లోపు.. సాయంత్రం 3 తర్వాత

వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులు రద్దీ తక్కువగా ఉండే సమయాల్లోనే దర్శనానికి రావాలని ఈవో విజ్ఞప్తి చేశారు. ఉదయం 8 గంటల్లోపు లేదా సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య ఇంద్రకీలాద్రికి రావాలని సూచించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లకు సహకరించాలని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. శీనానాయక్ కోరారు.

# తెలంగాణలో దసరా సెలవులు ఖరారు

## - పాఠశాలలకు 13 రోజులు, కాలేజీలకు 12 రోజులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)తెలంగాణలోని విద్యార్థులకు దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి.ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

# ఫోన్‌లో ప్రపంచం దగ్గరైంది బంధాలు దూరం అయినాయి

ఫోన్ వల్ల బంధాలు బంధుత్వాలు ఆప్యాయత ఏమైపోతుంది.?
- మన ఫోన్‌లో వందల మంది కాంటాక్టులు ఉన్నారు, కానీ మనసుకు దగ్గరగా ఉన్నవారు ఎంతమంది.?
- చేతిలో ఫోన్ పెరిగింది మనుషుల మధ్య మాట తగ్గింది
- మనకు వేల లైక్‌లు వస్తున్నాయి... కానీ మన కష్టాన్ని అడిగి తెలుసుకునే వారు ఎంతమంది?
- ఒకే ఇంట్లో ఉన్న నలుగురు వ్యక్తులు రోజుకు ఎంతసేపు నిజంగా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్నారు.?
- మన పిల్లలకు ఫోన్ ఇచ్చే సమయం కంటే, మన సమయం ఇస్తున్నామా.?
- టెక్నాలజీ మన జీవితాన్ని దగ్గర చేస్తుందా, లేక మనుషుల మధ్య దూరాన్ని పెంచుతోందా.?

**ఫోన్‌ను వదిలేయాల్సిన అవసరం లేదు.కానీ ఫోన్ కోసం మనుషులను వదిలేయకూడదు. ఫోన్‌లో బ్యాటరీ తక్కువైతే ఛార్జర్ కోసం వెతుకుతాం. అదే విధంగా మన బంధాల్లో ఆప్యాయత తగ్గుతున్నప్పుడు...మనసుకు మనమే ఒకసారి ఛార్జింగ్ ఇవ్వాలి.ఒక ఫోన్‌కాల్ చేయాలి.ఒకసారి ఇంటికి వెళ్లాలి.ఒకసారి తల్లిదండ్రుల పక్కన కూర్చోవాలి.ఒకసారి పిల్లలతో ఫోన్ లేకుండా ఆడుకోవాలి.ఒకసారి బంధువును మనస్ఫూర్తిగా పలకరించాలి.ఎందుకంటే...ఫోన్ పాడైతే కొత్తది కొనవచ్చు.కానీ కోల్పోయిన సమయం తిరిగి రాదు.దూరమైన బంధం తిరిగి అదే స్థాయిలో రావచ్చు అని హామీ లేదు.కోల్పోయిన ఆప్యాయతను ఏ టెక్నాలజీ కూడా కొనివ్వలేదు.అందుకే టెక్నాలజీని ఉపయోగిద్దాం...కానీ మనుషులను మర్చిపోకుండా.**

## ప్రజా ప్రశ్న ప్రత్యేక కథనం..
## మేడ్చల్ ప్రతినిధి చిన్న

ఒకప్పుడు ఇంట్లో కుటుంబ సభ్యులు ఒకచోట కూర్చుంటే నవ్వులు, మాటలు, సరదా సంభాషణలు వినిపించేవి. బంధువులు ఇంటికి వస్తే గంటల తరబడి మాట్లాడుకునేవారు. పండుగలు, శుభకార్యాలు అంటే అందరూ ఒకచోట చేరి ఆప్యాయంగా పలకరించుకునేవారు.
ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఇంట్లో అందరూ ఒకచోట ఉన్నా... ప్రతి ఒక్కరి చేతిలో ఒక ఫోన్. పక్కనే కూర్చున్న మనిషితో మాట్లాడటానికి సమయం లేకపోయినా, దూరంగా ఉన్న వ్యక్తి సోషల్ మీడియాలో ఏం చేస్తున్నాడో తెలుసుకోవడానికి మాత్రం సమయం ఉంటుంది.
ఫోన్ మన జీవితాన్ని సులభతరం చేసింది. కానీ అదే సమయంలో మనుషుల మధ్య సహజమైన సంభాషణ, ఆప్యాయత, అనుబంధం తగ్గిపోతున్నాయా? అనే ప్రశ్న కూడా ముందుకొస్తోంది.



### ఒకే ఇంట్లో ఉన్నా... ఒకరికొకరు దూరం

ఒకప్పుడు కుటుంబ సభ్యులు భోజనం చేస్తూ రోజంతా జరిగిన విషయాలను మాట్లాడుకునేవారు. ఇప్పుడు భోజనం చేస్తున్న సమయంలో కూడా ఫోన్ చేతిలో ఉండటం సాధారణమైంది. తండ్రి తన పనిలో, తల్లి తన ఫోన్‌లో, పిల్లలు తమ తమ వీడియోలు లేదా గేమ్స్‌లో మునిగిపోతే... ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ కుటుంబ సంభాషణ తగ్గిపోతుంది. ఇంట్లో సమస్య వచ్చినప్పుడు కూడా నేరుగా మాట్లాడటం కంటే మెసేజ్‌ల ద్వారా మాట్లాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇలా కొనసాగితే కుటుంబం ఒకే కప్పు కింద ఉన్నా, ప్రతి వ్యక్తి తనకంటూ ఒక ప్రత్యేక ప్రపంచంలో జీవించే పరిస్థితి ఏర్పడుతుంది.

### తల్లిదండ్రులు - పిల్లల మధ్య పెరుగుతున్న గ్యాప్

పిల్లలతో మాట్లాడటానికి తల్లిదండ్రులకు సమయం కావాలి. కానీ ఉద్యోగం, ఇంటి పనులు, ఫోన్ వినియోగం కలిసి కుటుంబ సమయాన్ని తగ్గిస్తున్నాయి. పిల్లలు కూడా తల్లిదండ్రులతో మాట్లాడటం కంటే ఫోన్‌లో వీడియోలు చూడటం, గేమ్స్ ఆడటం, సోషల్ మీడియాను ఉపయోగించడం వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడకుండా ఫోన్ ఎక్కువ చూడొద్దు అని మాత్రమే చెప్పడం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. పిల్లలకు మనం ఇచ్చే గొప్ప బహుమతి ఖరీదైన వస్తువు కాదు... మన సమయం, మన మాట, మన శ్రద్ధ.

### వృద్ధుల ఒంటరితనం

ఇంట్లో వృద్ధులు ఉంటే వారికి కావాల్సింది పెద్దగా ఏమీ కాదు. కాసేపు పక్కన కూర్చొని మాట్లాడే మనిషి కావాలి.వాళ్లు చెప్పే పాత జ్ఞాపకాలు మనకు చిన్నవిగా అనిపించవచ్చు. కానీ వాళ్ల జీవితంలో అవే ఎంతో విలువైన అనుభవాలు. మనం ఫోన్‌లో బిజీగా ఉండటం వల్ల వారి మాటలు వినడానికి కూడా సమయం కేటాయించలేకపోతే, వాళ్లలో ఒంటరితనం పెరిగే అవకాశం ఉంటుంది. ఒక ఫోన్‌ను పక్కన పెట్టి తాతయ్య, అమ్మమ్మ, తల్లిదండ్రులతో పది నిమిషాలు మాట్లాడటం కూడా ఒక పెద్ద ఆప్యాయత.

### బంధువుల మధ్య సంబంధాలు 'ఆన్‌లైన్'కే పరిమితం

గతంలో బంధువుల ఇంటికి వెళ్లడం, క్షేమ సమాచారాలు తెలుసుకోవడం, పండుగలకు కలుసుకోవడం సాధారణం.ఇప్పుడు "హాయ్", "హ్యాపీ బర్త్‌డే", "హ్యాపీ ఫెస్టివల్" అంటూ ఒక మెసేజ్ పంపితే బాధ్యత పూర్తయినట్టుగా భావించే పరిస్థితి పెరుగుతోంది. సోషల్ మీడియాలో ఒకరి ఫొటోకు లైక్ చేయడం, కామెంట్ పెట్టడం అనేది నిజమైన ఆప్యాయతకు ప్రత్యామ్నాయం కాదు. వర్చువల్ సంబంధాలు ఉండొచ్చు... కానీ మనసుకు కావాల్సింది నిజమైన మానవ సంబంధమే.

### పండుగలు... ఫొటోలకే పరిమితమవుతున్నాయా?

పండుగ అంటే ఒకప్పుడు కుటుంబం మొత్తం కలిసి వంటలు చేసుకోవడం, బంధువులను కలవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం. ఇప్పుడు పండుగ సందర్భంగా అందరూ కలిసి ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో పెట్టడం ప్రధానంగా మారుతున్న సందర్భాలు ఉన్నాయి.
ఫొటో తీసుకోవడం తప్పు కాదు. కానీ ఫొటో కోసం కలుసుకుని, కలిసిన తర్వాత కూడా అందరూ ఫోన్‌లోనే ఉంటే ఆ కలయికలోని ఆప్యాయత ఎక్కడ?పండుగ ఫొటోలో అందరూ కనిపించడం కంటే... పండుగ సమయంలో అందరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం ముఖ్యం.

### లైక్'లు పెరుగుతున్నాయి... కానీ పలకరింపులు తగ్గుతున్నాయి

సోషల్ మీడియాలో మన పోస్టుకు వందల లైక్‌లు రావచ్చు. కానీ మన బాధను అడిగి తెలుసుకునే వ్యక్తులు ఎంతమంది? మనం సంతోషంగా ఉన్నప్పుడు ఫొటోకు లైక్ చేసే వాళ్లు చాలామంది ఉండొచ్చు. కానీ మనకు కష్టం వచ్చినప్పుడు పక్కన నిలబడే వ్యక్తుల సంఖ్య తక్కువగా ఉండవచ్చు.అందుకే సోషల్ మీడియా పరిచయాలను నిజమైన బంధుత్వాలకు ప్రత్యామ్నాయంగా చూడకూడదు.

### భార్యాభర్తల మధ్య కూడా ఫోన్ ఒక మూడో వ్యక్తిగా మారుతోందా?



ఇద్దరూ ఇంట్లో ఉన్నా ఇద్దరి దృష్టి రెండు ఫోన్లపై ఉంటే సహజమైన సంభాషణ తగ్గుతుంది.రోజులో జరిగిన విషయాలను పంచుకోవడం, ఒకరి సమస్యలను మరొకరు వినడం, కలిసి కొంత సమయం గడపడం దాంపత్య జీవితంలో ముఖ్యమైన అంశాలు.ఫోన్ వినియోగం ఎక్కువైతే చిన్న విషయాలపై కూడా అపార్థాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.
ఒకరికొకరు సమయం ఇవ్వడం కూడా సంబంధాన్ని కాపాడుకునే ఒక ముఖ్యమైన మార్గం.

### పిల్లల బాల్యం స్క్రీన్‌లోనే గడిచిపోకూడదు

పిల్లలకు ఫోన్ ద్వారా సమాచారం, విద్య, వినోదం లభిస్తున్నాయి.అదే సమయంలో అధిక స్క్రీన్ సమయం వల్ల కుటుంబంతో మాట్లాడే సమయం, బయట ఆడుకునే సమయం, పుస్తకాలు చదివే అలవాటు వంటి వాటిపై ప్రభావం పడవచ్చు. అందుకే పిల్లలకు ఫోన్ పూర్తిగా నిషేధించడం కంటే, కుటుంబం కలిసి సమయ పరిమితులు, ఫోన్ లేని సమయాలు నిర్ణయించుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.
ముఖ్యంగా తల్లిదండ్రులు స్వయంగా ఆ నియమాలను పాటిస్తే పిల్లలు కూడా వాటిని సులభంగా అనుసరించే అవకాశం ఉంటుంది.

### ఫోన్ తప్పు కాదు... మన వినియోగమే అసలు ప్రశ్న

ఫోన్ వల్ల దూరంగా ఉన్న కుటుంబ సభ్యులతో వెంటనే మాట్లాడగలుగుతున్నాం. అత్యవసర సమయంలో సహాయం పొందగలుగుతున్నాం. విద్య, ఉద్యోగం, వ్యాపారం, సమాచార రంగాల్లో ఫోన్ ఎంతో ఉపయోగపడుతోంది.

### కాబట్టి సమస్య ఫోన్ ఉండటంలో కాదు.

ఫోన్ కోసం మనుషులను, కుటుంబాన్ని, సంబంధాలను, మన సమయాన్ని త్యాగం చేస్తున్నామా? అనేదే అసలు ప్రశ్న.

### మనమే కొన్ని చిన్న మార్పులు చేసుకోవాలి

భోజనం చేసే సమయంలో ఫోన్‌ను పక్కన పెట్టడం.కుటుంబ సభ్యులంతా కలిసి మాట్లాడుకునే సమయాన్ని ప్రతిరోజూ కేటాయించడం. పిల్లలతో కొంత సమయం ఫోన్ లేకుండా గడపడం. ఇంట్లో వృద్ధులతో కాసేపు కూర్చొని వారి మాటలు వినడం.బంధువులకు అప్పుడప్పుడు మెసేజ్ కాకుండా నేరుగా ఫోన్ చేయడం. వారానికి లేదా రోజులో కొంత సమయం "ఫోన్ లేని కుటుంబ సమయం..గా నిర్ణయించుకోవడం. అవసరం లేని నోటిఫికేషన్లు తగ్గించడం ద్వారా పదేపదే ఫోన్ చూసే అలవాటును తగ్గించుకోవడం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588